# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

17.2.2026 మంగళవారం Tuesday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 215 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









## శబరిమలలో మహిళలకు ప్రవేశం

- విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం
- ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ

4

కేరళలోని శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశం, ఇతర మతపరమైన ప్రదేశాలలో వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. 2026, ఏప్రిల్ 7వ తేదీ నుంచి తొమ్మిది మంది న్యాయ మూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసులను విచారించనుంది.

## రైతులకు ప్రభుత్వం తీపి కబురు

### సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల



సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 తెలంగాణ ప్రభుత్వం బోనస్‌గా ఇస్తున్న విషయం తెలిసిందే. వానాకాలంలో సన్న వడ్లు అమ్మిన 2.17లక్షల మంది రైతులకు బోనస్ బకాయిలు చెల్లింపు కోసం రూ.514.36 కోట్లు విడుదల చేసింది.

2

## కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

- అధికారులకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశాలు

03



కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది.



3

## ఇక ఈ అవమానాన్ని భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది
- జగిత్యాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన



3

## కాంగ్రెస్ తీరు దుర్మార్గం

మండిపడ్డ కేంద్రమంత్రి బండి



## ఉత్కంఠ.. ఉద్రిక్తం.. ఉత్సాహం

### మేయర్లు, చైర్మన్‌ఎన్నికల్లో గందరగోళం

- నిజామాబాద్‌లో కాంగ్రెస్.. కొత్తగూడెంలో సీపీఐకి పట్టం
- కామారెడ్డి, ఆదిలాబాద్‌లో స్వతంత్రులకు అవకాశం
- ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత.. బల్దియా ఆసీసుపై రాళ్లదాడి
- తొర్రూర్‌లోఉద్రిక్తం.. ఎక్స్‌అఫిషియోగా ఓటేసిన ఎంపీ కావ్య
- మున్సిపల్ ఆఫీసు వద్ద బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు. మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. కొన్ని పట్టణాలు, నగరాల్లో అంచనాలు తారు మరయ్యాయి. ఇబ్రహీంపట్నం, తొర్రూరు, క్యాతనపల్లి, జనగామ, జమ్మికుంటలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఏడు కార్పొరేషన్లలో ఐదింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో సీపీఐ జెండా ఎగిరింది. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పదవి ఎట్టకేలకు బీజేపీకే దక్కింది. ఇక్కడ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక్కడి నుంచి కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్‌గా మాజీ మేయర్ సునీల్ రావుగా ఎన్నికయ్యారు. నిజామాబాద్ మేయర్‌గా కూరగాయల ఉమారాణిని ఎన్నుకున్నారు.



**తె**లంగాణలో మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాయి, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై ఎస్ఈసీ అధికారిక వివరాలు వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం కాంగ్రెస్ ఖాతాలో 82 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు చేరాయి. బీఆర్ఎస్ ఖాతాలో 17 మున్సిపాలిటీలు చేరగా, బీజేపీ ఖాతాలో ఒక మున్సిపాలిటీ, ఒక కార్పొరేషన్ చేరింది. ఇక సీపీఐ ఖాతాలో కొత్తగూడెం కార్పొరేషన్ చేరగా, ఇండిట్లు నాలుగు మున్సిపాలిటీలను దక్కించుకున్నారు.

## 10 బల్దియాల్లో వాయిదా

- ఖానాపూర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు
- సుల్తానాబాద్‌లో ఖరారు కాని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు
- కోరం లేక వాయిదా వేసిన అధికారులు

2



## నేటి నుంచి బయో ఏషియా సదస్సు

- రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు
- సదస్సును ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి

బయో ఏషియాఉ2026 సదస్సుకు రాజధాని ముస్తాబైంది. నేడు, రేపు (ఈ నెల 17, 18 తేదీల్లో) హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్‌ఐసీసీ) హాల్-4లో రెండ్రోజులపాటు సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 17న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, మంత్రి శ్రీధర్‌బాబు బయో ఏషియా సదస్సు 23వ ఎడిషన్‌ను ప్రారంభిస్తారు. 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్- బయాలజీ రివల్యూషన్"అనే థీమ్ తో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బయో టెక్నాలజీ, ఔషధాలు, హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు, 50 దేశాలకు చెందిన 3 వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, సరికొత్త ఆలోచనలను ఈ సదస్సు వేదికగా పంచుకోనున్నారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు.


మిగతా 2 లో



## కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

- ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు
- రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి
- మధిరలో మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం

4

## ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ ఆహ్వానం

4





# రైతులకు తీపి కబురు

**సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ.514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ల÷తుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

**అధికారులకు సీఎస్ ఆదేశాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷–లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷–లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సీఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 18న మీడియా అకాడమీలో శిక్షణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** భూ హక్కులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ రిపోర్టింగ్ పై ఒక్క రోజు శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు తెలిపారు. నెల 18వ తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో ఈ శిక్షణా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భూ చట్టాలు- భూ సమస్యల పరిష్కారం, వ్యవసాయం–అనుబంధ రంగాలలో ప్రభుత్వ స్కీములు, బ్యాంకు రుణాలు, పర్యావరణ భద్రత, చెరువులను కాపాడుకోవడం, జర్నలిస్టుల నైతిక నియమావళి, మీడియా–చట్టాలు, డిజిటల్ రిపోర్టింగ్, వ్యవసాయం, రైతు సమస్యలు, గ్రామీణ ప్రాంతాలు, రెవెన్యూ అంశాలపై జర్నలిస్టులకు అవగాహన కల్పించడంతోపాటు రిపోర్టింగ్‌లో పర్యావరణ, సాంకేతిక అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నిపుణులు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. మీడియా రంగం వేగంగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని, సమాజానికి నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని కార్యదర్శి పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన ప్రతిభను మరింత పెంపొందించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు.

# ఉత్కంఠ.. ఉద్రిక్తం.. ఉత్సాహం

మొదటి పేజీ తరువాయి




తొలిసారిగా కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ అయిన మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్లగొండలలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా 57వ డివిజన్ కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్య ఎన్నికయ్యారు. అనూహ్య పరిణామాల మధ్య కామారెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాలు ఇండిపెండెంట్లకు దక్కాయి. కామారెడ్డి నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందిన ఇప్పు ఉమారాణి మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యారు. ఆమె కౌన్సిలర్‌గా గెలిచిన తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ దక్కక పోవడంతో ఉమారాణికి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఇచ్చాయి. వైస్ చైర్ పర్సన్ బీఆర్ఎస్ కు దక్కింది. ఆదిలాబాద్ లో కాంగ్రెస్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి బండారి అనూష చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. తొర్రూరులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చోటు చేసుకున్న గొడవలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పీఏకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఇక్కడి నుంచి వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటును వినియోగించుకునేందుకు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇబ్రహీంపట్నం లో కౌన్సిలర్ల కిడ్నాప్ వార్త కలకలం రేపింది. దీంతో ఆందోళన కారులు బల్దియా ఆఫీసుపై రాళ్లు రువ్వడంతో గందరగోళం నెలకొంది.

# 10 మున్సిపాలిటీల్లో వాయిదా

**ఖానాపూర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు**

**సుల్తానాబాద్‌లో ఖరారు కాని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు**

**కోరం లేక వాయిదా వేసిన అధికారులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** రాష్ట్రవ్యాప్తంగా 9 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి, ఇబ్రహీంపట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, డోర్నకల్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనే పేర్లు ఇంకా ఫిక్స్ కాలేదు.

**కుదరని ఏకాభిప్రాయం**

**నిర్మల్:** ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది, 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపీ,



బీఆర్ఎస్ మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది.

**క్యాతనపల్లిలో తీవ్ర ఉద్రిక్తత**

**కోల్ బెల్ట్:** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30 గంటల కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు..12 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

## తొర్రూరులో ఉద్రిక్తత

**మున్సిపల్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ ఘర్షణ**

**భారీగా మోహరించిన పోలీసులు**

**మహబూబాబాద్, ఫిబ్రవరి 16 :** తొర్రూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణకు దిగాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు బస్సులో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరకు బస్సును ఆఫీస్ వరకు అనుమతించారు. అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి కాంగ్రెస్ కౌన్సిలర్లు వచ్చారు. వరంగల్ ఎంపీ కావ్యను ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు చేయడం పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి అభ్యంరతం వ్యక్తం చేశారు. మాజీ మంత్రిని అధికారులు అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ క్రమంలో అక్కడికి భారీ సంఖ్యలో చేరుకున్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. ఎర్రబెల్లి పీఏపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. పరిస్థి తి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌కు ప్రజల భారీ మద్దతు

**ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజల తీర్పు**

**రాజకీయాలకు అతీతంగా మధిర అభివృద్ధి**

**మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**ఖమ్మం,ఫిబ్రవరి16 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఘనవిజయంపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మధిరలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా పట్టణాల్లో కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో ప్రజలు పట్టం కట్టడం చారిత్రాత్మకమని ఆయన అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమం , ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే ప్రజలు ఈ తీర్పు ఇచ్చారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. కేవలం గ్రామాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో కూడా కాంగ్రెస్ అత్యంత బలంగా ఉ



ందని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పట్టణ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషికి ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీని ఏకపక్షంగా గెలిపించిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా, ప్రభుత్వం మరింత బాధ్యతగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి, పట్టణ ప్రజల రుణం తీర్చుకుంటామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇందుకోసం పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన , ఉద్యోగాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. మధిర నియోజకవర్గాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా 'డెవలప్మెంట్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 'నో పాలిటిక్స్.. ఓన్లీ డెవలప్మెంట్ అనే నినాదంతో ముందుకు సాగుతామని, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నేటి నుంచి బయో ఏషియా సదస్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్‌బయో అన్‌లీష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్ , హెల్త్‌కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆమ్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు.




వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు , ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్ట్స్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్.. డేటా అనలిటిక్స్ , ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్–క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్‌గా మార్చే రోడ్‌మ్యాప్. ఆర్ / డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్ , కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్‌లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్‌బయో' హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# ఇక ఈ అవమానాన్ని భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టం
- జగిత్యాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన



**జగిత్యాల,ఫిబ్రవరి16 :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. ఈ ఎన్నిక ముగింపు కాదు.సోమవారం జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్ కు రాసిచ్చారా అంటూ ఆవేదన చెందారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఎంపిక విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. తన ప్రతిపాదనను కాదని, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి అధిష్టానం ప్రాధాన్యత ఇవ్వడంతో ఆయన కలత చెందారు. తన వర్గానికి చెందిన వ్యక్తికి కాకుండా.. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేయడాన్ని ఆయన అవమానంగా భావిస్తున్నారు. 'నా గురించి, పార్టీతో నాకు ఉన్న అనుబంధం గురించి మీకు తెలుసు. పార్టీలో కొనసాగాలనే విషయంపై ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన ఎవరో వచ్చి మా మీద ఆధిపత్యం చెలాయిస్తున్నారు. మా హక్కులను కాలరాస్తున్నారు. మా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను కాపాడలేకపోతున్నా. ఈ క్షోభ ముగింపు కాదు. ఈ వేధింపులు భరిస్తూ పార్టీలో కొనసాగగలుగుతామా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ వేధింపులు భరించగలుగుతానా? ఎంత కాలం భరించగలుగుతాను? దీనికి పరిష్కారం ఏంటి? అని కూడా ఊహించలేకపోతున్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా నేడు కేసీఆర్ జన్మదిన వేడుకలు

## తెలంగాణ భవన్‌లో 72 కిలోల కేక్ కట్ చేస్తాం

### బిఆర్ఎస్ నేత సాయికిరణ్ వెల్లడి




**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణ రాష్ట్రం అంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే రోజు కేసీఆర్ పుట్టిన రోజు అని బీఆర్ఎస్ నేత తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. ఆయన గాంధేయ మార్గంలో తెలంగాణ రాష్ట్రాన్ని ధించిన నాయకుడని కొనియాడారు. తెలంగాణభవన్ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెచ్చిన తెలంగాణను పదేండ్లలో దేశంలోనే నెంబర్ వన్ స్థాయికి తీసుకెళ్ళిన నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. తెలంగాణ జాతిపితగా కేసీఆర్‌ను గౌరవవిస్తారని, రేపు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టినరోజు ఘనంగా జరుపుతున్నామని తలసాని సాయికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్, హరీష్ రావుతోపాటుగా తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితర సీనియర్ నేతలు అందరూ పాల్గొంటారని చెప్పారు. కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు ఉంటాయన్నారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ 72వ పుట్టినరోజు సందర్భంగా 72 కిలోల కేక్ కటింగ్ ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రావణ కాష్టంగా మారిందని సాయికిరణ్ అన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీ ఎన్నికలకు ఏ ముఖ్యమంత్రి కూడా ప్రచారం చేసిన దాఖలాలు లేవని అన్నారు. ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ పార్టీకి 42 శాతం ఓటు షేర్ వచ్చిందని చెప్పారు. రేవంత్ రెడ్డి ఆయన జీవిత కాలంలో మళ్ళీ ముఖ్యమంత్రి కాలేడని అన్నారు. రౌడీయిజం ఎన్నో ఏండ్లు సాగదని వ్యాఖ్యానించారు. పదేండ్లు బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలా తాము కూడా వ్యవహరిస్తే ఆ పార్టీ ఉండేదే కాదన్నారు. కేసీఆర్‌ను తక్కువ చేసి మాట్లాడినంత మాత్రాన ఆయన పవర్ తగ్గదని, ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉంటారని అన్నారు. గాంధేయ మార్గంలో ఉద్యమం ఎలా చెయ్యాలో కేసీఆర్ తమకు నేర్పించారని చెప్పారు. ఉద్యమాలు తమకు కొత్తకాదని, తమ నాయకులపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటామని అన్నారు. తెలంగాణ భవన్‌లో డప్పు వాయిద్యాలతో కోలాహలంగా కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు జరుగుతాయని తలసాని సాయికిరణ్ చెప్పారు. బీఆర్ఎస్ శ్రేణులు గ్రేటర్ హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో స్థానికంగా తమ కార్యక్రమాలు ముగించుకొని తెలంగాణ భవన్‌కు రావాలని కోరారు.

# రష్యా నిర్ణయంపైనే బంగారం ధరలు

## డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న పసిడి

### అంతర్జాతీయ నిపుణుల వెల్లడి





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థితి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చుని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# సెంట్రల్ వర్సిటీ ల్యాప్‌టాప్ చోరీ కేసు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ల్యాప్‌టాప్‌ల చోరీ కేసును గచ్చిబౌలి పోలీసులు చేధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సీఆర్ రావు ఏఐఎమ్‌సీఎస్ విభాగం టార్గెగా చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. చోరీలో కూకట్‌పల్లికి చెందిన రేగుల చంద్రశేఖర్‌ని(30) ప్రధాన నిందితుడిగా గుర్తించారు. మిగిలిన ఇద్దరు సాయిచరణ్(19), అశ్విన్ రావు (19)ను అరెస్ట్ చేశారు. వీరిద్దరూ విద్యార్థులే. యూనివర్సిటీ భద్రతా వ్యవస్థ గురించి సరైన అవగాహనతో, అర్ధరాత్రి సమయంలో దుండగులు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలతో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేసి.. నిందితులను గుర్తించి, అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి సుమారు 60 ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోరీకి ఉపయోగించిన 2 కార్లు, 3 సెల్ ఫోన్లను కూడా సీజ్ చేశారు. ఈ కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించారు గచ్చిబౌలి పోలీసులు. యూనివర్సిటీ క్యాంపస్‌లో భద్రతా లోపాలపై కూడా దృష్టి సారించి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# న్యాయవాది హత్య కేసు

## డీజీపీని నివేదిక కోరిన మానవ హక్కుల కమిషన్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** చేవెళ్ల పరిధిలో జరిగిన భూ వివాద ఘటనలో న్యాయవాది జి. స్వప్న కుమారి దారుణ హత్యను నివారించడంలో మొయినాబాద్ పోలీసులు తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై, డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన న్యాయవాదులు దాఖలు చేసిన ఫిర్యాదు పరిగణనలోకి తీసుకుంది. మృతురాలు తన సోదరుడిని నిందితుడిగా పేర్కొంటూ తన ప్రాణాలకు ముప్పు ఉందని ముందుగా పోలీసులకు హెచ్చరించినప్పటికీ, పోలీసులు సకాలంలో నివారణ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, ఇది విధి నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యంగా పరిగణించాల్సిన విషయమని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) నుండి సమగ్ర నివేదిక కోరుతూ, కేసును తదుపరి పరిశీలన కోసం మార్చి6కు వాయిదా వేశారు.



# కాంగ్రెస్ తీరు దుర్మార్గం

## మండిపడ్డ కేంద్రమంత్రి బండి

**కరీంనగర్, ఫిబ్రవరి 16:** కరీంనగర్ పట్టణ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన తీరుపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల తీర్పును పక్కనబెట్టి కాంగ్రెస్ కుట్రలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక విషయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసి బీజేపీకి మేయర్ పదవి రాకుండా అడ్డుకుందని మండిపడ్డారు. బీజేపీ బలపడుతున్నందుకే కాంగ్రెస్ భయపడుతోందని అన్నారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందని పేర్కొన్నారు. తాను ప్రధాని నరేంద్ర మోదీకి మాటిచ్చానని, కరీంనగర్‌లో బీజేపీని గెలిపించి తన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. కరీంనగర్ ప్రజలు ఎప్పటికీ బీజేపీతోనే ఉంటారని, భవిష్యత్తులో కూడా పార్టీ విజయాలను కొనసాగిస్తుందని బండి సంజయ్ పేర్కొన్నారు. బలం లేని చోట కూడా కాంగ్రెస్ కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రలోభాలతో కార్పోరేటర్లను వశపరచుకునే ప్రయత్నం చేసిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నీతిమాలిన పనులను ఆయన తప్పుపట్టారు. కాగా, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ దక్కించుకుంది. 34 మంది కార్పొరేటర్ల మద్దతుతో ఆ పార్టీ నేత కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా ఎన్నికయ్యారు. డిప్యూటీ మేయర్‌గా కూడా అదే పార్టీకి చెందిన సునీల్‌రావు అనే వ్యక్తి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మేయర్ పదవిని సాధించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు.

# చిరంజీవి భుజానికి సర్జరీ

## కోలకుంటున్నానంటూ పోస్ట్



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** అగ్ర కథానాయకుడు చిరంజీవి భుజానికి సర్జరీ జరిగింది. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఎక్స్ వేదికగా చిరు పోస్ట్ పెట్టారు. తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చేతికి పట్టీ ఉండటం గమనించి పలువురు శ్రేయోభిలాషులు నా ఆరోగ్యం గురించి ఆరా తీశారు. నా భుజానికి చిన్న కీ-హోల్ సర్జరీ జరిగింది. ప్రస్తుతం నేను బాగానే కోలుకుంటున్నా. నా దినచర్య సజావుగా సాగుతోంది. ఆర్థోస్కోపీ సర్జన్ డాక్టర్ నితిన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సర్జరీ విషయంలో తీసుకున్న జాగ్రత్తలు, ఆయన నైపుణ్యంతో ఆ పక్రియ అంతా సజావుగా, సౌకర్యవంతంగా సాగింది. నా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమ, అభిమానం, అందిస్తున్న దీవెనలకు మనసు ఎంతో సంతోషంగా ఉందని ఎక్స్ వేదికగా చిరంజీవి వెల్లడించారు. ఇదిలావుంటే అల్లు శిరీష్ వివాహం సందర్భంగా మొదటి శుభలేఖను చిరంజీవికి అందించారు. అల్లు అరవింద్ దంపతులు, అల్లు శిరీష్ స్వయంగా చిరు ఇంటికి వెళ్లి నూతన వస్త్రాలతో పాటు వివాహ ఆహ్వాన పత్రికను అందించి పెళ్లికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిరంజీవి చేతికి కట్టు ఉండటం గమనించి పలువురు అభిమానులు ఆందోళన చెందారు. ఆయనకు ఏమైందంటూ ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో చిరంజీవి స్వయంగా తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ పోస్ట్ పెట్టారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది

## ఫలితాలపై బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు విశ్లేషణ



**హైదరాబాద్, ఫిబ్రవరి 16:** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ప్రజల నుండి మంచి ఆదరణ లభించిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచందర్ రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాల్లో బీజేపీ విజయం సాధించడం పార్టీ బలోపేతానికి సంకేతమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకు ఇతర పార్టీలు అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని రామచందర్ రావు అన్నారు. భైంసాలో బీజేపీ విజయం సాధించకుండా చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 15 మున్సిపాలిటీల్లో బీజేపీ గట్టిపోటీ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ది రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెరుగుతున్నదానికి నిదర్శనమని రామచందర్ రావు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీని మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ బీజేపీకి ఉత్సాహాన్ని నింపాయని రామచందర్ రావు పేర్కొన్నారు.



సంపాదకీయం

# పక్కా నీటి ప్రణాళికలే రాష్ట్రాలకు మేలు!

పోలవరం సహా అనేక ప్రాజెక్టులు ఇంకా పూర్తికాలేదు. పోలవరం పన్నెండేళ్లుగా నానుతోంది. నాలుగైదే ళ్లలో పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ ఇంకా పూర్తి కాలేదు. ఏయేటి కాయేడు నిర్మణ ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. రాయలసీమతో సహా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటి గురించి పట్టించుకోకుండా కొత్తగా నల్లమలసాగర్ పేరుతో చంద్రబాబు ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టడం వెనక పెద్ద వ్యూహం ఉండివుంటుంది. తెలంగాణలో కూడా కాళేశ్వరంను తిడుతూ రెండేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలవడంతో తమకు ప్రజల మద్దతు ఉందని చెప్పుకోవడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చలేరు. ఇక్కడా అనేక ప్రాజెక్టులు పూర్తి కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పం ప్రకటించాలి. అంతే తప్ప ఎంతసేపు ఎన్నికలు, ఫలితాలు వంటివాటితో పొంగిపోరాదు. నీటిని వాడుకోవడం ఎలా అన్న దానిపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు కసరత్తు చేయాలి. వ్యవసాయరంగంలో విప్లవం సాధించా లంటే నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. ఇకపోతే రెండేళ్ల యినా చేయాల్సిన పనులు చేయకుండా ఎంతసేపు జగన్‌ను ఆడిపోసుకోవడంతోనే కలం గడిపేస్తున్నారు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామన్నది తొలి కార్యాచరణ కావాలి. ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతా మని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రాధాన్యత ఇవ్వకుండా లేని ప్రాజెక్టుతో వివదాలు సృష్టించడం, కేంద్రంపై ఒత్తిడి తేవడం వంటివన్నీ అనవసర విన్యాసాలు తప్ప మరోటికాదు. ఇరు రాష్ట్రాల మధ్య సయోధ్యతో ముందుకు సాగాల్సిన అసవరం ఉంది. ఒకప్పుడు తాను ఉమ్మడి ఎపికి సిఎంగా చేశానని గుర్తించి చంద్రబాబు నడవాల్సి ఉంది. అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలి చ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం అవసరం. కానీ అలా జరగడం లేదు. ఇకపోతే ఃూష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటు న్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమల తో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉ ందని సమాచారం. అంతకన్నా ముఖ్యం గా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళన కరం. ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు-ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి?' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడం మంచిదే అయినా భూములు, నీటి అనుకూలత వంటి విషయలను రైతులతో చర్చిస్తే మంచిది. పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాత లను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రాష్ట్రానికి శ్రేయ- స్కరం కాదు. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది. ఉన్ననీటి వనరులను వాడుకోవడం, అసవరమైన పంటలను పండించడం, రైతులకు లాభాలు చేకూర్చడం అన్నది ఓ ప్రణాళికా బద్ధంగా సాగాల్సిన విషయం. ఇందకు ప్రణాళికలు రచించి ముందుకు సాగితే మంచిది. అది వ్యవసాయపరంగా విప్లవాత్మకంగా మారుతుందనడంలో సందేహం లేదు.

# ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

- ప్రపంచ దేశాలకు ప్రధాని మోడీ ఆహ్వానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

# అన్నిరంగాల్లో కృత్రిమ మేధ వినియోగం

- సానుకూల దిశగా ఆలోచిస్తేనూ మేలు
- దుర్వినియోగం చేస్తే దుష్ఫలితాలు తప్పవు
- కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి
- ఏఐ సదస్సుకు భారీగా భద్రతా ఏర్పాట్లు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16:** అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ వాడకంలో అప్రమత్తత అవసర మని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉ ందని ఆందోళన వ్యక్తంచేశారు. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఇదిలావుంటే దేశ రాజధాని దిల్లీ వేదికగా 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది. 20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు. వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. దిల్లీ వీధుల్లో 10 వేలమందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.



# శబరిమల తదితర ప్రాంతాల్లో మహిళలకు ప్రవేశం

**విచారణకు 9మంది న్యాయమూర్తులతో ధర్మాసనం**

**ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు సుప్రీం విచారణ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరుతూ దాఖలైన 67 పిటిషన్లపై త్వరలో విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. పలు మతపరమైన ప్రదేశాలలో మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై విచారణ చేపట్టేందుకు 9 మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు వెల్లడించింది. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టడానికి ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 22 వరకు రెండు వారాల సమయం కేటాయిస్తున్నట్లు అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ అంశంపై ఏప్రిల్ 7న ఉదయం 10.30 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని తెలిపింది. శబరిమలతో పాటు దర్గాలు, మసీదుల్లోకి ముస్లిం మహిళల ప్రవేశం, ఇతర మతస్థుల్ని పెళ్లాడే పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవడం వంటి అంశాల పైనా విచారణ జరపనుంది. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటుచేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు తెలిపారు.

# నేడు మోడీతో ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ


**న్యూఢిల్లీ,ఫిబ్రవరి16 :** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. రేపు మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.



# రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

**ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం**

**జయపుర, ఫిబ్రవరి 16:** రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉ న్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాం÷-రతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.



# సొంత పార్టీ వాళ్లే తిరగపడ్డారు

17 వార్డు కౌన్సిలర్ అజిమొద్దీన్ వైస్ చెర్మన్ ఇవ్వాలని డిమాండ్



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** చెన్నూర్‌లో మంత్రి వివేక్ ఇలాకాలో తిరగబడ్డ సొంత పార్టీ చెందిన 17వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ వర్గీయులు, చెన్నూరు మున్సిపాలిటీలో కొలువుదీరిన పాలకవర్గంలో వైస్ చైర్మన్ పదవి ఇవ్వలేదని నిరసన చేపట్టరు 17వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ వర్గానికి చెందిన వారు అజీమొద్దీన్ కు వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిరసన చేపట్టారు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పదవులు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆందోళన చేపట్టరు, తమ వార్డు కౌన్సిలర్ కు వైస్ చైర్ మెన్ పదవి ఇవ్వకపోతే ఆందోళన చేపడతామని అవసరం అయితే పార్టీ మారేందుకు కూడా వెనుకడ మని హెచ్చరించిన కాంగ్రెస్ కౌన్సిలర్ వర్గీయులు

# మీడియాకు అవమానం.?



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రం లో మున్సిపల్ కార్యాలయం దగ్గర గంటల తరబడి వికారాబాద్ మునిసిపల్ ప్రధాన గేటు ముందు నిరీక్షణ మున్సిపల్ కార్యాలయ లోపలికి మీడియాకు అనుమతి లేదంటూ పోలీసుల వివరణ ఎప్పుడైతే మీడియాకు అవమానం జరుగుతదో ఆ రాజకీయ పార్టీలపై చాలా తీవ్రమైన ప్రభావం చూపుతుంది. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం అనంతరం కూడా సమాచారం ఇవ్వడంలో అధికారుల విఫలం ఇది రిపోర్టర్ల స్వార్థం కాదు రిపోర్టర్ల వార్తల కోసం కాదు లీడర్ల వార్తలు రాయడానికే అనుమతి అడిగినా కూడా నిరాకరించే పరిస్థితి. తెలంగాణ మొత్తం మున్సిపల్ కార్యాలయాల లోపల మీడియాకు అనుమతి ఉన్నా కూడా వికారాబాద్‌లో ఉండదు అంట. లోపల ఏం సీక్రెట్ ఉండెనో మరి అందుకే రిపోర్టర్లను లోపలికి అనుమతించలేరు. ఇటువంటి వార్తలు రాయడానికి ఇష్టం లేకున్నా కూడా రాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

# ప్రశాంతంగా మేయర్,

మున్సిపల్ చైర్మన్ల ఎంపిక



**మంచిర్యాల,నేటి సాక్షి:** మంచిర్యాల జిల్లాలోని ఒక నగరపాలక సంస్థ మరియు నాలుగు పురపాలక సంఘాలకు జరిగిన ఎన్నికలలో భాగంగా మేయర్, చైర్మన్ల ఎంపిక ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ కుమార్ దీపక్ ఈ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. మున్సిపల్ కార్యాలయాల్లో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం అనంతరం ఈ పదవులకు ఎన్నికలు నిర్వహించారు. మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా చల్లా రమ్య ఎన్నికయ్యారు. మొత్తం 60 డివిజన్ల కార్పొరేటర్లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం మెజార్టీ సభ్యుల మద్దతుతో వీరిని ఎన్నుకున్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా దావ స్వాతి, వైస్ చైర్‌పర్సన్‌గా రాగంశెట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారు. చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పెద్దింటి పద్మ, వైస్ చైర్‌పర్సన్‌గా నాయకపు వినయ్ ఎంపికయ్యారు. లక్షెట్టిపేట చైర్‌పర్సన్‌గా దొంత అంజలి, వైస్ చైర్‌పర్సన్‌గా మోతుకూరి రాజేశ్వరి ఎన్నికయ్యారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో సోమవారం జరగాల్సిన ఎన్నిక ప్రక్రియ కోరం లేకపోవడంతో వాయిదా పడింది. ప్రత్యేక సమావేశానికి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎంపికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం, పోలీసుల సమన్వయంతో ఎన్నికల ప్రక్రియ అంతా సజావుగా సాగిందని కలెక్టర్ కుమార్ దీపక్ సంతృప్తి వ్యక్తం చేశారు.


# అంజన్నను దర్శించుకున్న హీరో

అర్జున్



**నేటి సాక్షి, మల్యాల జగిత్యాల:** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామిని సినీ నటుడు అర్జున్ సర్జా సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్జున్ కు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ, కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం తన అదృష్టమని, స్వామివారి ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులతో కాసేపు సందడి చేసిన ఆయన, అనంతరం తన కుమార్తె ఐశ్వర్య సర్జా నటించిన సీతా పయనం సినిమా ప్రమోషన్ కోసం జగిత్యాల పట్టణంలోని థియేటర్ కు వెళ్లారు.

# నా భార్య కుమారుడిని పంపించండి







**నేటి సాక్షి కోరుట్ల:** తన భార్య మరియు కుమారుడిని తన వద్దకు పంపించాలని కోరుతూ ఒక వ్యక్తి తన తల్లితో కలిసి పెట్రోల్ క్యాన్‌తో పోలీస్ స్టేషన్ ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కోరుట్ల పట్టణంలో కలకలం సృష్టించింది. న్యాయం చేయకపోతే పెట్రోల్ పోసుకుని ప్రాణాలు తీసుకుంటానని బాధితుడు చేసిన హెచ్చరికతో పోలీసులు మరియు స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కోరుట్ల పట్టణంలోని అయ్యప్పగుట్టకు చెందిన గంధం శ్రీకాంత్ భార్య రాజేశ్వరి, గత ఐదేళ్లుగా కుమారుడితో కలిసి కోరుట్ల మండలం జోగినిపల్లిలోని తన పుట్టింటి వద్దే ఉంటోంది. శ్రీకాంత్ తన భార్యను కాపురానికి రమ్మని, కుమారుడిని చూడనివ్వమని అత్తగారింటికి వెళ్లిన ప్రతిసారి అత్త లక్ష్మి మరియు ఇతరులు తనపై దాడులు చేస్తున్నారని బాధితుడు ఆరోపించారు. ఇప్పటికే మూడుసార్లు తనను చంపేందుకు ప్రయత్నించారని, కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఈ విషయంపై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని శ్రీకాంత్ ఆరోపించారు. ఒక తండ్రిగా తన కుమారుడిని చూసే హక్కును కూడా కాలరాస్తున్నారని, చావడానికైనా సిద్ధమే కానీ న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యాయత్నం సమయంలో మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. విచారణకు పిలిచిన పోలీసులు:పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు

- పోలీస్ స్టేషన్ ముందు తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం

రంగప్రవేశం చేసి బాధితుడిని సముదాయించారు. శ్రీకాంత్ ఫిర్యాదును వినేందుకు అతడిని స్టేషన్‌లోకి పిలిపించడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి శ్రీకాంత్‌కు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# కాగజ్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో ఉత్కంఠ

**నేటి సాక్షి కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం జరుగుతున్న రాజకీయ పోరు పతాక స్థాయికి చేరింది. సోమవారం జరగాల్సిన ఎన్నిక ప్రక్రియ కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా పడింది. సినిమా క్లైమాక్స్‌ను తలపించేలా సాగిన ఈ రాజకీయ డ్రామాలో విపక్షాలు వేసిన మైండ్ గేమ్ అధికార పక్షానికి గట్టి షాక్ ఇచ్చింది. మున్సిపల్ ప్రత్యేక సమావేశానికి మొత్తం 30 మంది కౌన్సిలర్లకు గాను కేవలం 14 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులో బిఆర్ఎస్ కు చెందిన 11 మంది సభ్యులతో పాటు ఇద్దరు స్వతంత్రులు, ఒక ఎంఐఎం కౌన్సిలర్ మాత్రమే ఉన్నారు. కాంగ్రెస్, బిజెపి సభ్యులతో పాటు మరో ఇద్దరు స్వతంత్రులు సభకు రాకుండా మొండిచేయి చూపారు. నిర్ణీత సంఖ్యలో సభ్యులు లేకపోవడంతో అధికారులు ఎన్నికను రేపటికి వాయిదా వేశారు. ఈ పరిణామాల మధ్య ఎంఐఎం పార్టీకి చెందిన కౌన్సిలర్ ఆలియా భేగంను బిఆర్ఎస్ నాయకులు కిడ్నాప్ చేసి తమ శిబిరంలో ఉంచుకున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా



చేశారు. మరోవైపు గైర్హాజరైన సభ్యులను తమ వైపు తిప్పుకునేందుకు తెరవెనుక భారీ స్థాయిలో క్యాంపు రాజకీయాలు మరియు మంతనాలు జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కోరం లేక ఎన్నిక వాయిదా పడటంతో అందరి దృష్టి మంగళవారం నాటి గడువుపైనే ఉంది. మ్యాజిక్ ఫిగర్ సాధించి మున్సిపల్ పీఠంపై పాగా వేసే ఆ లేడీ కింగ్ ఎవరన్నది ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణమంతా పోలీసుల కంచుకోటలా మారింది. ఒక్క రాత్రిలో రాజకీయ సమీకరణాలు తారుమారయ్యే అవకాశం ఉండటంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

# గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో చైర్‌పర్సన్ ఎన్నిక ఉత్కంఠ



**నేటి సాక్షి, గజ్వేల్:** సిద్దిపేట జిల్లా రాజకీయాల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక ఆసక్తికర మలుపులు తిరిగింది. బీసీ మహిళకు కేటాయించిన ఈ పదవిపై అధికార తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పార్టీలోనే తీవ్రమైన అంతర్గత పోటీ నెలకొంది. మాజీ మంత్రి టి. హరీష్ రావు, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అనుచరుల మధ్య చైర్‌పర్సన్ పదవి కోసం గట్టి పోటీ జరిగింది. మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డులు ఉండగా, 46,734 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించారు. ఫలితాల్లో టీఆర్ఎస్ 11 వార్డులు గెలుచుకుని మెజారిటీ సాధించగా, కాంగ్రెస్ 7, బీజేపీ 1, స్వతంత్ర అభ్యర్థి 1 వార్డులో విజయం సాధించారు. అయినప్పటికీ, చైర్‌పర్సన్ ఎంపిక ప్రక్రియలో పార్టీ అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. ఉద్యమకారులకు ప్రాధాన్యం

- టీఆర్ఎస్‌లో అంతర్గత పోటీ బహిర్గతం ప్రతాపరెడ్డి వర్గానికి పైచేయి

ఇవ్వలేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వంటేరు ప్రతాపరెడ్డి తన ముఖ్య అనుచరుడికి చైర్‌పర్సన్ పదవి సాధించడంలో సఫలమయ్యారు. మరోవైపు, తన వర్గానికి పదవి దక్కకపోవడంపై హరీష్ రావు అనుచరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గజ్వేల్ నియోజకవర్గంలో వ్యక్తిగత ప్రభావం పెరుగుతోందన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది. ఈ పరిణామాలు భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.కాగా, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గంగిశెట్టి చందన, వైస్ చైర్మన్‌గా కళ్యాణ్కర్ పద్మాబాయి ప్రమాణస్వీకారం చేశారు. ఆర్డీవో చంద్రకళ వారి చేత ప్రమాణస్వీకారం చేయించగా, అంతకుముందు గెలుపొందిన 20 మంది కౌన్సిలర్లు కూడా ప్రమాణస్వీకారం చేశారు.

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- 2027 జూలైలో జరగనున్న పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- ధర్మపురి, కోటిలింగాల ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి





**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో, రాధారపు నర్సయ్య:** 2027 జూలై నెలలో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్, దేవదాయ, విద్యుత్ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులతో గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు శాఖల వారీగా రూపొందించిన ప్రణాళికలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే సమర్పించిన నివేదికలను మండల స్థాయిలో మరోసారి సమీక్షించి, వారం రోజుల్లో సమగ్ర నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ధర్మపురి మరియు కోటిలింగాల ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. పుష్కర స్నానాలకు లక్షలాది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, స్నాన ఘాట్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వసతి వంటి సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఒకే రోజు రెండు లక్షలకు పైగా భక్తులు పుష్కర ఘాట్లకు చేరుకున్నా ఇబ్బంది లేకుండా రహదారుల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరి నది తీర ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న పుష్కర ఘాట్ల అభివృద్ధితో పాటు అవసరమైన చోట్ల కొత్త ఘాట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రవేశించే గోదావరి తీర ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని, పుష్కరాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, బి.రాజగౌడ్, ఆర్డీవో, డిఎస్పీ (ఎస్‌బి), సంబంధిత శాఖల ఎస్ఈలు, ఈఈలు, డిఈలు, కలెక్టరేట్ ఏవో, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్, ధర్మపురి ఆలయ ఈవో తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం ఆదర్శ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు






**నేటి సాక్షి, ధర్మారం:** పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం వీడ్కోలు మరియు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థులు, తొమ్మిదవ మరియు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అలాగే ఆరవ తరగతి నుండి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు వార్షికోత్సవ వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించిన వివిధ విద్యా, సాంస్కృతిక మరియు క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధ్యాగేటి ప్రవీణ్ యాదవ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ధ్యాగేటి ఉదయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి విజయాలు సాధించి తమ గ్రామం, రాష్ట్రం, దేశానికి సేవ చేయాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్‌గా సాత ప్రవీణ్ కుమార్



- శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

**నేటి సాక్షి శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్‌గా 15వ వార్డు నుంచి గెలిచిన సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్‌గా 14వ వార్డు కౌన్సిలర్ శ్వేతా పాండురంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో చేవెళ్ల ఇన్చార్జ్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి నూతనంగా ఎన్నికైన 15 మంది కౌన్సిలర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

### ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లు:

ఒకటవ వార్డు నుండి ఎర్రోళ్ల ఆనంద్ రావు, రెండో వార్డు నుంచి బిసోళ్ల సంధ్యారాణి, మూడో వార్డు నుంచి గుండ గిరిజ, నాలుగో వార్డు నుంచి మణికొండ లలిత, ఐదో వార్డు నుంచి బానూరు కృష్ణ, ఆరో వార్డు నుంచి ఉష కిరణ్, ఏడో వార్డు నుంచి బండ్లగూడెం ప్రశాంత్, ఎనిమిదో వార్డు నుంచి పీచరి అఖిల, తొమ్మిదో వార్డు నుంచి వాకిటోళ్ళ గణేష్, పదో వార్డు నుంచి రాజండ్ల వసంత, 11వ వార్డు నుంచి ఫైముదా బేగం, 12వ వార్డు నుంచి దండు రాజేశ్వర్, 13వ వార్డు నుంచి చాకలి అశోక్ ప్రమాణ స్వీకారం చేశారు.

### అభివృద్ధికి ప్రాధాన్యత:

ఈ సందర్భంగా నూతన చైర్మన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన వార్డు ప్రజలకు మరియు ఎమ్మెల్యే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో పట్టణంలోని పెండింగ్ పనులను పూర్తి చేస్తానని, శంకర్‌పల్లిని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి పాల్గొని నూతన పాలకవర్గాన్ని సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ యోగేష్ మరియు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్‌గా చిలుకూరి సుధా బాలకృష్ణ





**నేటి సాక్షి మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మరియు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ ఉత్సాహంగా సాగింది. సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ చైర్మన్‌గా 31వ వార్డు (బంగారుగడ్డ) నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున భారీ మెజార్టీతో గెలిచిన చిలుకూరి సుధా బాలకృష్ణ ఎన్నికయ్యారు. మిర్యాలగూడ

మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు రిజర్వు అయినప్పటికీ, ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ బీసీ సామాజిక వర్గానికి చెందిన చిలుకూరి సుధాకు ఈ అవకాశం కల్పించింది. మెజార్టీ కౌన్సిలర్లు ఆమె వైపు మొగ్గు చూపడంతో చైర్మన్ పీఠం దక్కింది. అదేవిధంగా వైస్ చైర్మన్‌గా 41వ వార్డు నుంచి గెలుపొందిన గుడిపాటి శిరీష నవీన్ ఎంపికయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో ఆమె ఈ పదవిని చేపట్టారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి శిరీష నవీన్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కు, పట్టణ సీనియర్ నాయకులకు మరియు తోటి కౌన్సిలర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అందరితో కలిసి పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చేర్యాల మున్సిపల్ పీఠం బీఆర్ఎస్ కైవసం



- చైర్‌పర్సన్‌గా ముస్త్యాల అరుణ

**చేర్యాల, నేటి సాక్షి:** సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపల్ పీఠాన్ని బీఆర్ఎస్ పార్టీ దక్కించుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ ముస్త్యాల అరుణ బాలనరసయ్య, వైస్ చైర్‌పర్సన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ ఎన్నికయ్యారు. సోమవారం డీపీఓ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ ముగిసింది. ముందుగా ఎన్నికైన 12 మంది వార్డు కౌన్సిలర్లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. మధ్యాహ్నం జరిగిన ఎన్నికలో చైర్‌పర్సన్ పదవికి ముస్త్యాల అరుణ పేరును కమలాపురం గీతాంజలి ప్రతిపాదించగా, వీరబత్తిని సదానందం బలపరిచారు. మెజార్టీ సభ్యుల మద్దతు ఉండటంతో అరుణను చైర్‌పర్సన్‌గా ప్రకటించారు. అదేవిధంగా వైస్ చైర్‌పర్సన్ పదవికి మేడిశెట్టి ఉమా పేరును నిమ్మ సుప్రజా ప్రతిపాదించగా, ఇజాజ్ అహ్మద్ బలపరిచారు. తగిన బలం ఉండటంతో ఆమెను వైస్ చైర్‌పర్సన్‌గా అధికారులు ధృవీకరించారు. ఈ ఎన్నికలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒకటవ వార్డు కౌన్సిలర్ ఒగ్గు వెంకటమ్మ బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా చేయి ఎత్తి ఓటు వేయడం చర్చనీయాంశమైంది. ఆమె పార్టీ కండువా కప్పుకోకుండానే అధికార పక్షానికి ఓటు వేయడంపై రాజకీయ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నిక అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లతో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుస్నాబాద్ ఏసీపీ సదానందం ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

# మంత్రి వివేక్ వెంకటస్వామికి

## పాలాభిషేకం




**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** చెన్నూరు మున్సిపల్ చైర్మన్ పెద్దింటి పద్మ శ్రీనివాస్ మున్సిపల్ చైర్మన్‌గా మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన వారికి నియమించిన మంత్రి వివేక్ వెంకటస్వామి ఎంపి వంశీ కృష్ణలకు  చెన్నూరు మున్నూరు కాపు సంఘాల నేతృత్వంలో చెన్నూర్ పాత బస్టాండ్ అంబేద్కర్ చౌక్ వద్ద మంత్రి వివేక్ వెంకటస్వామికి ఎంపి వంశీకృష్ణ పాలభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో, సాట్లపల్లి శ్రీధర్ పటేల్ మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి గుర్రం సమ్మయ్య పటేల్ మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి జేక సంజీవ్ హైకోర్టు అడ్వకేట్ జిట్టా రమేష్ సర్పంచ్ మారిసెట్టి తిరుపతి సర్పంచ్ పడాల సతీష్ సర్పంచ్ గుర్రం రాజన్న గుర్రం తిరుపతి కొట్లారి మధుకర్ కొండు వెంకటేష్ తోట అశోక్ సద్ది సాయికిరణ్ సుంకరి మల్లయ్య తనుగుల రవికుమార్ బీసీ రాష్ట్ర కార్యదర్శి నీలం శ్రీనివాస్ చిన్న నారాయణ పడాల మహేష్ బొడ్డు గోపి మంద అంకయ్య నారి శెట్టి ప్రశాంత్ తదితరులు మున్నూరు కాపు నాయకులు కాపు పెద్దలు పాల్గొన్నారు

# ఎన్ జి కళాశాల సరితకు డాక్టరేట్





**నేటిసాక్షి, నల్లగొండ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో సోమవారం జంతుశాస్త్ర విభాగంలో ఒప్పంద అధ్యాపకురాలు వాంక్ డోతు సరితకు రాజస్థాన్ కు చెందిన శ్రీ జగదీశ్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ తెలిపారు. డా. ఇమ్రాన్ ఖాన్ పర్యవేక్షణలో "మేనేజిరియల్ కాంపిటెన్స్ అండ్ ట్రైనింగ్ నీడ్స్ పౌల్ట్రీ ఫామ్స్" అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను విశ్వవిద్యాలయం ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పరిశోధన ద్వారా పౌల్ట్రీ రంగంలో నిర్వహణ విధానాల మెరుగుదల, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రైతులకు అవసరమైన శిక్షణా విధానాలపై సమగ్ర విశ్లేషణ చేశారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధికి, రైతుల ఆదాయ వృద్ధికి, మరియు సమర్థవంతమైన నిర్వహణ పద్ధతుల అమలుకు ఈ పరిశోధన దోహదపడనుంది. ఈ కార్యక్రమంలో డా. సరితను వైస్ ప్రిన్సిపాళ్లు డా. రవి కుమార్, డా. అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణఅధికారి డా.ముని స్వామి, విద్యాత్మిక సమన్వయ కర్త బత్తిని నాగరాజు, జంతు శాస్త్ర విభాగం అధ్యక్షులు డా. జ్యోత్స్న, తెలుగు శాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు డా. జి. భాగ్యలక్ష్మి, డా. ఎ. మల్లేశం, డా. మహేశ్వరి, వెంకట్ తదితరులు అభినందించారు.

# ఆశయాలకు అనుగుణంగా సేవలు

## నక్క సంతోషి రాములు గౌడ్ హామీ



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్, సోమవారం: సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో నూతన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలంగా నక్క సంతోషి రాములు గౌడ్ అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడుతూ తన గెలుపుకు అహర్నిశలు కృషి చేసిన 15వ వార్డు ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, సిద్దిపేట డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి తదితర నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వార్డు ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శక పాలన అందిస్తూ 15వ వార్డు సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు.

# గంగమ్మ సేవలో పెద్దిరెడ్డి

## ద్వారకనాథరెడ్డి



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మను తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి. దర్శించుకున్నారు ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం మండపంలో వేద ఆశీర్వాదం గంగమ్మ మెమొంటోను అందించి సత్కరించారు, ఆలయ అధికార అర్చక సిబ్బంది వైసిపి నాయకులు పాల్గొన్నారు

# యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ ఉత్కంఠ విజయం

## ఆల్‌రౌండర్ షోతో అదరగొట్టిన అజ్మతుల్లా ఒమర్జాయ్

## సూపర్ 8 ఆశలు సజీవంగా ఉంచుకున్న ఆఫ్ఘనిస్తాన్

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన గ్రూప్ డి మ్యాచ్‌లో యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ 5 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్న ఆఫ్ఘనిస్తాన్ జట్టు యూఏఈని 160 పరుగులకే పరిమితం చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్ అద్భుత ప్రదర్శనతో ఆఫ్ఘనిస్తాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి 162 పరుగులు చేసి గెలుపొందింది. ఈ విజయంతో ఆఫ్ఘనిస్తాన్ టోర్నీలో తమ తొలి గెలుపును నమోదు చేసుకోవడంతో పాటు సూపర్ 8 ఆశలను సజీవంగా ఉంచుకుంది.

### ఆదుకున్న సోహైబ్ ఖాన్, చెలరేగిన ఒమర్జాయ్



తొలుత బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఆర్యన్ష్ శర్మ డకౌట్ కాగా, కెప్టెన్ ముహమ్మద్ వసీం 10 పరుగులకే పెవిలియన్ చేరాడు. 13 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన యూఏఈని సోహైబ్ ఖాన్, అలీషాన్ షరఫు ఆదుకున్నారు. వీరిద్దరూ కలిసి 3వ వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సోహైబ్ ఖాన్ 48 బంతుల్లో 68 పరుగులు, అలీషాన్ షరఫు 31 బంతుల్లో 40 పరుగులతో రాణించారు. అయితే ఆఫ్ఘన్ బౌలర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ 4 వికెట్లతో చెలరేగడంతో యూఏఈ వరుసగా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముజీబ్ ఉర్ రెహ్మాన్ 2 వికెట్లు పడగొట్టగా, కెప్టెన్ రషీద్ ఖాన్ 1 వికెట్ తీసి టీ20 క్రికెట్‌లో 700 వికెట్లు పూర్తి చేసుకున్న తొలి బౌలర్‌గా రికార్డు సృష్టించాడు.

### జద్రాన్ అర్ధశతకం, ఒమర్జాయ్ ఫినిషింగ్

161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు కూడా తొలి ఓవర్‌లోనే షాక్ తగిలింది. ఇన్‌ఫామ్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇబ్రహీం జద్రాన్ 41 బంతుల్లో 53 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. గుల్బదిన్ నైబ్, సెదికుల్లా అటల్ కాసేపు పోరాడి అవుట్ అయ్యారు. 10వ ఓవర్లో 70 పరుగులకు 3 వికెట్లు కోల్పోయిన దశలో దర్విష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్ అద్భుతమైన పోరాట పటిమను కనబరిచారు. రసూలీ 23 బంతుల్లో 33 పరుగులు చేశాడు. మరోవైపు ఒమర్జాయ్ బ్యాట్‌తో కూడా చెలరేగి కేవలం 21 బంతుల్లోనే 2 ఫోర్లు, 3 సిక్సర్లతో అజేయంగా 40 పరుగులు సాధించి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు. బౌలింగ్, బ్యాటింగ్ రెండు విభాగాల్లోనూ అదరగొట్టి మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసిన అజ్మతుల్లా ఒమర్జాయ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ గెలుపుతో ఆఫ్ఘనిస్తాన్ పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి చేరుకోగా, యూఏఈ టోర్నీ నుంచి దాదాపుగా నిష్క్రమించింది.





# ఆస్ట్రేలియాపై శ్రీలంక ఘన విజయం

## అద్భుత శతకంతో చెలరేగిన పాతుమ్ నిస్సంక..

## సూపర్ 8కి చేరిన శ్రీలంక, ఆస్ట్రేలియాకు నిరాశ

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్ బి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై శ్రీలంక 8 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టు ఆస్ట్రేలియాను 181 పరుగులకే పరిమితం చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పాతుమ్ నిస్సంక సంచలన శతకంతో చెలరేగడంతో శ్రీలంక కేవలం 18 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 184 పరుగులు చేసి ఘన విజయం నమోదు చేసింది. ఈ విజయంతో శ్రీలంక అధికారికంగా సూపర్ 8 దశకు చేరుకోగా, ఆస్ట్రేలియా టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది.

### కుప్పకూలిన ఆస్ట్రేలియా ఇన్నింగ్స్

తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ అద్భుతమైన శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు వీరిద్దరూ కలిసి 104 పరుగులు జోడించారు. ట్రావిస్ హెడ్ 56 పరుగులు, మిచెల్ మార్ష్ 54 పరుగులతో రాణించారు. ఆ తర్వాత శ్రీలంక స్పిన్నర్లు రంగంలోకి దిగడంతో మ్యాచ్ స్వరూపం పూర్తిగా మారిపోయింది. దుషన్ హేమంత 3 వికెట్లతో ఆస్ట్రేలియా పతనాన్ని శాసించాడు. ఇతర బౌలర్లు కూడా రాణించి కీలక వికెట్లు పడగొట్టడంతో ఆస్ట్రేలియా వరుసగా వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 181 పరుగులకే ఆలౌట్ అయింది.

### నిస్సంక సంచలన ఇన్నింగ్స్

182 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు 2వ ఓవర్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. మార్కస్ స్టోయినిస్ బౌలింగ్‌లో ఓపెనర్ కుశాల్ పెరీరా 1 పరుగుకే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కుశాల్ మెండిస్‌తో కలిసి పాతుమ్ నిస్సంక ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడ్డాడు. వీరిద్దరూ కలిసి 2వ వికెట్‌కు 97 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కుశాల్ మెండిస్ 51 పరుగులు చేసి అవుట్ అయినప్పటికీ, నిస్సంక ఏమాత్రం తగ్గకుండా ఆడుతూ కేవలం 52 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు సాధించాడు. పవన్ రత్నాయకే 15 బంతుల్లో 28 పరుగులతో అజేయంగా నిలిచి నిస్సంకకు చక్కటి సహకారం అందించాడు. ఈ అద్భుత ప్రదర్శనతో పాతుమ్ నిస్సంకకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ ఓటమితో గ్రూప్ బి పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి పడిపోయిన ఆస్ట్రేలియా, సూపర్ 8 ఆశలు సజీవంగా ఉండాలంటే తమ తదుపరి మ్యాచ్‌లో గెలవడంతో పాటు ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ఇంగ్లాండ్ అద్భుత విజయం

## ఇటలీపై 24 పరుగుల తేడాతో గెలుపు.. సూపర్ 8కి దూసుకెళ్లిన ఇంగ్లాండ్ జట్టు

టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా ఫిబ్రవరి 16న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన గ్రూప్ సి మ్యాచ్‌లో ఇటలీపై ఇంగ్లాండ్ 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 202 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 203 పరుగుల లక్ష్య ఛేదనలో ఇటలీ జట్టు పోరాడినా ఫలితం దక్కలేదు. 20 ఓవర్లలో 178 పరుగులకు ఇటలీ ఆలౌట్ అయింది. ఈ అద్భుత విజయంతో గ్రూప్ సి నుంచి వెస్టిండీస్‌తో పాటు ఇంగ్లాండ్ కూడా సూపర్ 8 దశకు అధికారికంగా అర్హత సాధించింది.

### విల్ జాక్స్ సంచలన ఇన్నింగ్స్

తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఇంగ్లాండ్‌కు ఓపెనర్ ఫిల్ సాల్ట్ 15 బంతుల్లో 28 పరుగులతో శుభారంభం అందించాడు. కెప్టెన్ జోస్ బట్లర్ కేవలం 3 పరుగులకే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్ 23 పరుగులు, టామ్ బాంటన్ 30 పరుగులతో రాణించారు. ఒక దశలో 105 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఇంగ్లాండ్‌ను విల్ జాక్స్, సామ్ కర్రన్ ఆదుకున్నారు. సామ్ కర్రన్ 19 బంతుల్లో 25 పరుగులు చేశాడు. విల్ జాక్స్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 22 బంతుల్లోనే 4 సిక్సర్లు, 3 ఫోర్లతో అజేయంగా 53 పరుగులు సాధించాడు. దీనితో ఇంగ్లాండ్ 202 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. ఇటలీ బౌలర్లలో గ్రాంట్ స్టీవర్ట్, క్రిషన్ కలుగమగే చెరో 2 వికెట్లు తీశారు.

### పోరాడిన ఇటలీ బ్యాటర్లు

203 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇటలీకి తొలి ఓవర్‌లోనే జోఫ్రా ఆర్చర్ కోలుకోలేని దెబ్బ తీశాడు. ఆంథోనీ మోస్కా, జేజే స్మట్స్ ఇద్దరినీ డకౌట్‌గా వెనక్కి పంపాడు. 22 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో బెన్ మనేంటి సంచలన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 25 బంతుల్లోనే 6 సిక్సర్లు, 4 ఫోర్లతో 60 పరుగులు చేసి ఇటలీ శిబిరంలో ఆశలు రేపాడు. జస్టిన్ మోస్కా 34 బంతుల్లో 43 పరుగులతో అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో గ్రాంట్ స్టీవర్ట్ 23 బంతుల్లో 45 పరుగులతో పోరాడినప్పటికీ విజయానికి అది సరిపోలేదు. ఇంగ్లాండ్ బౌలర్లలో సామ్ కర్రన్ 3 వికెట్లు, జేమీ ఓవర్టన్ 3 వికెట్లు తీసి ఇటలీ పతనాన్ని శాసించారు. అద్భుతమైన అర్ధశతకంతో ఇంగ్లాండ్ విజయానికి బాటలు వేసిన విల్ జాక్స్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



# వ్యూయర్‌షిప్‌లో జియో హాట్‌స్టార్ ఆల్‌టైమ్ రికార్డు

## భారత్, పాక్ మ్యాచ్‌తో సరికొత్త చరిత్ర.. లైవ్ వ్యూయర్‌షిప్‌లో 6 కోట్లకు చేరిన రికార్డు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్ వ్యూయర్‌షిప్‌లో సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ మ్యాచ్ అధికారిక ప్రసారకర్త జియో హాట్‌స్టార్‌కు భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. భారత్ ఆధిపత్యం ప్రదర్శించి మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించినప్పటికీ వ్యూయర్‌షిప్‌లో మాత్రం సరికొత్త చరిత్ర నమోదైంది. ఈ మ్యాచ్‌కు మొత్తం 45.4 కోట్ల వ్యూస్ వచ్చినట్లు జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. క్రికెట్ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డుగా నిలిచింది. గతంలో 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ సమయంలో 5.9 కోట్ల లైవ్ కాన్‌కరెంట్ వ్యూస్ రాగా, తాజాగా జరిగిన భారత్–పాక్ మ్యాచ్‌కు ఈ సంఖ్య 6 కోట్లుగా ఉన్నట్లు సమాచారం.

కొలంబో వేదికగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి 61 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌కు ప్రతికూలంగా ఉన్న వికెట్‌పై భారత్ 176 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగా, పాకిస్థాన్ కేవలం 114 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో గ్రూప్ ఏ నుంచి టీమిండియా సూపర్ 8 బెర్త్ దక్కించుకోగా, పాకిస్థాన్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. భారీ ఓటమి కారణంగా పాక్ నెట్ రన్ రేట్ కూడా దెబ్బతింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా ఈ మ్యాచ్‌ను బహిష్కరిస్తామని పాకిస్థాన్ తొలుత ప్రకటించినప్పటికీ, ఐసీసీ జోక్యంతో తలొగ్గి మ్యాచ్ ఆడింది. ఈ పరిణామాల వల్ల మ్యాచ్‌పై విపరీతమైన క్రేజ్ పెరిగి వ్యూయర్‌షిప్ పెరగడానికి దోహదపడింది.

ఈ మ్యాచ్‌లో మిస్టరీ స్పిన్నర్ ఉస్మాత్ తారిక్ విలక్షణమైన యాక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొలంబో స్పిన్ పరిస్థితులకు తగ్గట్లు పాక్ జట్టులో 6 మంది స్పిన్నర్లు ఉన్నప్పటికీ భారత్ ధాటి ముందు వారు నిలవలేకపోయారు. ఏ దశలోనూ కనీస పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్థాన్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఒకవేళ ఈ మ్యాచ్ రద్దయి ఉంటే ప్రసారకర్త జియో హాట్‌స్టార్ భారీగా నష్టపోయేది, కానీ పాక్ ఆడిన బాయ్ కట్ డ్రామా మ్యాచ్‌పై హైప్ క్రియేట్ చేసి ఆ సంస్థకు భారీగా వ్యూయర్‌షిప్ వచ్చేలా కలిసి వచ్చింది.





# ప్రగ్య జైస్వాల్ రెడ్ హాట్ లుక్ వైరల్

ముంబై బ్యూటీ ప్రగ్య జైస్వాల్ నిరంతర సోషల్ మీడియా పోస్టులకు బోలెడంత ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. లక్షలాదిగా ఫ్యాన్స్ తనను అనుసరిస్తున్నారు. తాజాగా ఈ బ్యూటీ పోస్ట్ చేసిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. ప్రగ్య షేర్ చేసిన -సర్వింగ్ సిట్రస్- ఫోటో షూట్ హాట్ టాపిగ్గా మారింది. ప్రగ్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరెంజ్ కలర్ థై స్లిట్ డ్రెస్ ధరించి సెలయేటి పక్కన దిగిన ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలకు -పుల్లటి పండు అందిస్తున్నాను-- అని రాసింది. ఈ కొత్త లుక్ లో తన అందం, డ్రెస్సింగ్ స్టైల్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రగ్య మునుపటి కంటే ఈ లేటెస్ట్ లుక్ లో హాలిగా ఉందంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. కెరీర్ మ్యాటర్ కి వస్తే, ప్రగ్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఈ బ్యూటీ ఇటీవల అఖండ 2తో భారీ విజయం అందుకుంది. బాలయ్య-బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన ఈ భారీ సీక్వెల్‌లో తన నటనకు చక్కని పేరొచ్చింది. తదుపరి బాలీవుడ్ లో సీనియర్ నటుడు సన్నీడియోల్ సరసనా ఓ చిత్రంలో నటిస్తోందని సమాచారం. ప్రగ్య పార్టీ లైఫ్ విషయానికి వస్తే, తనకంటూ మంచి స్నేహితుల బృందం ఉంది. ఇందులో మంచు లక్ష్మి, రకుల్ ప్రీత్ చాలా కాలంగా మంచి స్నేహితులు. ఆ ఇరు కుటుంబాలతో కలిసి ప్రగ్య సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలు ఈడియోలు కూడా వైరల్ అయ్యాయి. స్నేహితులు కలిసి పార్టీలు చేసుకోవడం, జిమ్‌లో వర్కవుట్స్ చేయడం, విదేశీ పర్యటనలకు వెళ్లడం రెగ్యులర్ గా చూస్తున్నదే. మొత్తానికి ప్రగ్య తన గ్లామర్‌తో అటు సోషల్ మీడియాను, ఇటు సినిమాలతో బాక్సాఫీస్‌ను బ్యాలెన్స్ చేస్తోంది.

# ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷-జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో



హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.

# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం

ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.





# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్ పెళ్లి

## మార్చి4న హైదరాబాద్‌లో రిసెప్షన్ అంటూ ప్రచారం

టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ- హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్ధమవుతుంది. రష్మిక - విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.

# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.




Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
మంగళవారం
17 ఫిబ్రవరి 2026

# ప్రహరీకి దాతల సహకారం

## రామాపురంలో ప్రశంసలు



**నేటి సాక్షి చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రామాపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 17వేల రూపాయలతో ప్రహరి గోడను దాత మేజర్ తిపిరిశెట్టి సాయి భార్గవ్ సహకారంతో విజయవంతంగా పూర్తి చేయడం విశేషంగా నిలిచింది. పాఠశాల ప్రాంగణం భద్రతతో పాటు విద్యార్థులకు అనుకూల వాతావరణం ఏర్పడేలా ఈ ప్రహరీ గోడ ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ శివకుమారి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రాయబారపు వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ-విద్యార్థులు కలిసి దాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రాయికల్‌లో బీఆర్ఎస్ అధికారం

## చైర్‌పర్సన్‌గా కట్కం రవీందర్, వైస్ చైర్‌పర్సన్‌గా తురగ సౌజన్య ఎన్నిక



**నేటి సాక్షి - రాయికల్ ఇమ్మడి విజయ్ కుమార్:** రాయికల్ మున్సిపాలిటీలో చైర్మన్ పీఠంపై నెలకొన్న ఉత్కంఠకు సోమవారం తెరపడింది. కాంగ్రెస్ మరియు స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకుంది. చైర్‌పర్సన్‌గా కట్కం రవీందర్, వైస్ చైర్‌పర్సన్‌గా తురగ సౌజన్య-శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రవీందర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాయికల్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రత్యేక మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజాసేవే తన లక్ష్యమని, ఐదేళ్ల పాటు అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తానని తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ తురగ సౌజన్య మాట్లాడుతూ, నాలుగో వార్డు కౌన్సిలర్‌గా తనకు 702 ఓట్లు రావడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. గత ఐదేళ్లలో వార్డు అభివృద్ధి పనులే తన విజయంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. చైర్‌పర్సన్ మరియు కౌన్సిలర్లతో కలిసి రాయికల్ మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

# అభివృద్ధిలో కీలకపాత్ర

## పోషించాలి




**నేటి సాక్షి - చిలుకూరు:** చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ముక్కపాటి నరసింహారావు మాట్లాడుతూ, వార్డు సభ్యులు గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. తమ విధులు, బాధ్యతలు పూర్తిగా అవగాహన చేసుకుని, రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. మండలంలోని వార్డు సభ్యులకు రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు మొదటి విడత, 23 నుండి 27వ తేదీ వరకు రెండో విడత శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ వెంకటనారాయణ, అక్షయ్ తేజ, మల్లారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గుడికోటలో శివపార్వతుల

## రథోత్సవం వైభవంగా



**నేటి సాక్షి - రాయికల్ ఇమ్మడి విజయ్ కుమార్:** మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గుడికోటలో సోమవారం శివపార్వతుల రథోత్సవం కన్నుల పండుగలా నిర్వహించారు. ఉత్సవాల ఆఖరి ఘట్టంగా నిర్వహించిన రథోత్సవం భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం ఆలయ కమిటీ మరియు ప్రధాన అర్చకులు మంగోలి సతీష్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు మునుగోటి రమేష్ శర్మ శివపార్వతుల కళ్యాణం, అభిషేకం, బిల్వార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం స్వామివారి దర్శనం, రథోత్సవం డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా సాగింది. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మంతెన మహేందర్, కోశాధికారి సాంబారు శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# మెగ్యాతండాలో మిన్నంటిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



- బంజారా సంస్కృతి పరిరక్షణకు రూ. 10 కోట్లు కేటాయించాలి: ప్రభుత్వానికి డిమాండ్

**నేటి సాక్షి, చిన్నగూడూరు మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం మెగ్యాతండా గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. సేవాలాల్ సేన మరియు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపింది.

### సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు

"భోగ్ బందారో.. లాగ భోగ్ కట్ రోగ్.." అంటూ బంజారా సంప్రదాయ నినాదాలతో తండా మార్మోగింది. డోలు తాళాల మధ్య మహిళలు, యువత తమ సంప్రదాయ దుస్తులు ధరించి నృత్యాలు, భజనలతో సందడి చేశారు. గ్రామ పెద్దలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, సేవాలాల్ మహారాజ్ ఆశీస్సుల కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన మండల అధ్యక్షులు బాదావత్ సురేష్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు భూక్య చిరంజీవి మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ చూపిన ధర్మమార్గం యువతకు దిక్సూచి అని పేర్కొన్నారు. బంజారా సంస్కృతిని కాపాడుకోవడానికి ప్రభుత్వం తక్షణమే రూ. 10 కోట్ల నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. జయంతి నిర్వహణ నిధులను మండల వారీగా అన్ని కమిటీలకు సమానంగా పంపిణీ చేయాలి.

### నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలి.

సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాదావత్ జయప్రకాష్, మాజీ సర్పంచ్ బాదావత్ జ్యోతి రాము, వార్డు సభ్యులు గూగులోతు సావిత్రి రఘు, బాదావత్ బద్రి లక్ష్మణ్, బాదావత్ వెన్నెల శ్రీకాంత్, బాదావత్ బుజ్జి రెడ్డి, బాదావత్ మంగీలాల్, గ్రామ శాఖ అధ్యక్షులు బాధావత్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు. తండా ప్రజలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను దిగ్విజయం చేశారు.

# మరికల్ గ్రామపంచాయతీ దుకాణాలకు బహిరంగ వేలం

- ప్రతి నెల 5వ తేదీలోపు కిరాయిలు చెల్లించాలని ఆదేశం





**నేటి సాక్షి, నారాయణపేట, ఇమామ్ సాబ్:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి చెందిన దుకాణాలకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, వేలంలో పాల్గొనేవారు ముందస్తుగా రూ.5,000 డిపాజిట్ చేయాలని తెలిపారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించిన వారికే దుకాణాల కోసం పాట పాడే అవకాశం ఉంటుందని చెప్పారు. వేలంలో పాల్గొనేవారు మరికల్ గ్రామానికి చెందిన వారే కావాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 25 దుకాణాలు ఉన్నట్లు తెలిపారు. వేలంలో దుకాణాలు పొందిన వారు ఒక సంవత్సరం కిరాయిని ముందస్తుగా చెల్లించాలని, ప్రతి నెల 5వ తేదీలోపు కిరాయి చెల్లించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. కిరాయి చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తే దుకాణాన్ని మళ్లీ వేలం వేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా బంగారు పోగుల గొల్ల ఆంజనేయులు ఒక దుకాణానికి నెలకు రూ.26 వేల కిరాయి పాట పాడడంతో హాజరైనవారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వేలంలో ఎంపీవో వనజ, ఎస్సై రాములు, ఏఎస్సై ఎల్లయ్య, ఉపసర్పంచ్ కటికే కాజా, వార్డు సభ్యులు సురిటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానం అధికారుల తప్పిదానికి అటవీ శాఖ ఉన్నతాధికారి బలి





- సమతా సైనిక్ దళ్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సగినాల సురేష్, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న

**నేటి సాక్షి నంద్యాల:** నంద్యాల జిల్లా సమతా సైనిక దళ్ ఉపాధ్యక్షుడు సగినాల సురేష్, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, లీగల్ అడ్వైజర్ వాడాల రవికుమార్, ప్రజా సంఘాల నాయకులు శ్రీశైలంలో ఎన్నో తప్పిదాలు చేసిన ప్రభుత్వ శాఖలను వదిలిపెట్టి ఒక దళిత ఫారెస్ట్ అధికారిని బదిలీ చేయడం అనేది మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శ్రీశైలం భక్తులకు ఎలా కాపాడాలి అనే విషయాము అధికార పార్టీ నిర్లక్ష్య వైఖరి, అంతేకాని దళిత ఆఫీసర్ ను బదిలి చేయడం అన్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీశైల మహా క్షేత్రంలో జరిగిన దేవస్థాన అధికారుల తప్పిదానికి అటవీ శాఖ ఉన్నతాధికారిని బాధ్యుణ్ణి చేస్తూ బదిలీ వేటు వేయడంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈనెల 8వ తేదీ నుంచి శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కాగా అంతకు ముందే రెండు నెలల క్రితం నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వులో పెద్దపులుల అంచనా ప్రక్రియ కొనసాగింపకు (ఎన్ టి సిఏ ) నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (తేదీలు) నిర్ణయించింది. ఆ నిబంధనల మేరకు శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ బిల్లు డైరెక్టర్ బి.విజయకుమార్, ఆత్మకూరు అటవీ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేశ్ అప్పావ్ ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేట్ ప్రకారం నడుచుకున్నారు. అయితే శ్రీశైలం వెళ్లే పాదయాత్ర చేసే భక్తులకు నల్లమల అడవిలో అడ్డంకులు కల్పించారన్న సాకుతో శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ విజయ్ కుమార్ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలుపడ్డాయి. ఉరుము విరిగి మంగళం మీద పడ్డట్టు దేవస్థానం అధికారుల తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి దళిత సామాజిక వర్గానికి చెందిన అటవీశాఖ అధికారి బి.విజయ్ కుమార్ పై బదిలీ వేటు వేయడం తో ఆయనకు మద్దతు తెలుపుతూ సమతా సైనిక్ దళ్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సగినాల సురేష్, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, లీగల్ అడ్వైజర్ & న్యాయవాది వాడాల రవికుమార్, పర్యావరణ ప్రేమికులు, దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. శ్రీశైలం దేవస్థానం ఈవో, దేవస్థాన రెవెన్యూ విభాగం అధికారి, ప్రభుత్వ పెద్దలు శివ భక్తులపై లాఠీచార్జ్ చేసిన సివిల్ పోలీసులపై చర్యలకు పూనుకోవాల్సి ఉండగా, అందుకు సాహసించలేక దళిత సామాజిక వర్గానికి చెందిన నంద్యాల జిల్లా అటవీ సంరక్షణ అధికారి మరియు ప్రాంతీయ సంచాలకులు బి.విజయ్ కుమార్ (ఐఎఫ్ఎస్ )ను బదిలీ చేయడాన్ని సమతా సైనిక నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఖండిస్తున్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారి బి.విజయకుమార్ మాట్లాడుతూ నేను భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాకు ఆదర్శమని, భారత రాజ్యాంగం ప్రకారము కష్టపడి ఉద్యోగం తెచ్చుకోవడం జరిగిందని, నా విధి నిర్వహణలో ఎటువంటి తప్పిదాలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయనని అన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు ముందస్తు సమీక్ష సమావేశం





- వేసవికి ముందే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆదేశం

**నేటి సాక్షి; కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు ఆధ్వర్యంలో మంచినీటి ఎద్దడి నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామపంచాయతీలకు చెందిన నూతన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మరియు మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరయ్యారు. రానున్న వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మంచినీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సూచించారు. మిషన్ భగీరథ ట్యాంకులను తరచూ శుభ్రం చేయడం, పైప్‌లైన్‌లలో లీకేజీలను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా ప్రతి కుటుంబానికి సకాలంలో నీటి సరఫరా అందేలా చూడాలని తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా డిప్యూటీ ఇంజనీర్లు బాలరాజు, అనిల్ మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సంబంధిత ఏఈలకు సమాచారం అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్, మిషన్ భగీరథ అధికారులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవంలో ముఖ్య అతిథులుగా గిత్త.జయసూర్య

- టిడిపి సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి



**నేటి సాక్షి జూపాడుబంగ్లా:** జూపాడుబంగ్లా మండలంలోని, తుడిచెర్ల గ్రామంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ ఆహ్వానం మేరకు శ్రీ భ్రమరాంబ సమేత శంకర మల్లేశ్వరస్వామి వారి ప్రత్యేక పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, టిడిపి సీనియర్ నాయకుడు మాండ్ర.సురేంద్రనాథ్ రెడ్డి, పాములపాడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్, డీవీఎంసీ మెంబర్ లింగాల నాగరాజు, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, తదితర నాయకులకు ఘనంగా ఆహ్వానం పలకడం జరిగింది. శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత శ్రీ శంకర మల్లేశ్వర స్వామి తిరుణాలను పురస్కరించుకొని తూడిచర్ల గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కలిసి డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు కు శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలకు, ప్రజలకు ఆలయ కమిటీ వారికి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, టిడిపి సీనియర్ నాయకుడు మాండ్ర.సురేంద్ర నాథ్ రెడ్డి, పాములపాడు మండల టిడిపి ప్రధాన కార్యదర్శి-జి.హరి ప్రసాద్ యాదవ్, డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, తదితర నాయకులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత శ్రీ శంకర్ మల్లేశ్వర స్వామి ఆశీస్సులు, దీవెనలు రాష్ట్ర ప్రజలకు నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు నిండుగా ఉండాలని శంకర మల్లేశ్వర స్వామిని ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, మాండ్ర.శివానందరెడ్డి పిఎ-మద్దిలేటి, ఎమ్మెల్యే గవర్నమెంట్ పిఎ- రవీంద్ర, సోషల్ మీడియా ప్రతినిధి ప్రవీణ్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సమిండ్ల వాణి

## వైస్ చైర్మన్‌గా జీనత్ పర్వీన్ ఎన్నిక





**నేటి సాక్షి - జగిత్యాల టౌన్ (పూరెళ్ల బాపు):** జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 43వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ పదవికి కాంగ్రెస్ అభ్యర్థి సమిండ్ల వాణి, బీజేపీ అభ్యర్థి కొండా అరుణ పోటీపడగా, సమిండ్ల వాణికి 39 మంది కౌన్సిలర్లు మద్దతు తెలపగా, కొండా అరుణకు 5 మంది బీజేపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. దీంతో అధికారులు సమిండ్ల వాణిని విజేతగా ప్రకటించారు. వైస్ చైర్మన్‌గా జీనత్ పర్వీన్ ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా ఇరు వర్గాలు హైదరాబాద్‌లో కౌన్సిలర్లతో క్యాంపులు నిర్వహించగా, కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యే వర్గానికే మద్దతు తెలిపినట్లు సమాచారం. కాంగ్రెస్ తరపున చైర్‌పర్సన్ బి-ఫారం ను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య మున్సిపల్ అధికారులకు సమర్పించగా, కౌన్సిలర్లు పార్టీ నిర్ణయానికి కట్టుబడి వాణికి మద్దతు తెలిపారు. ఇటీవల ఉత్కంఠగా సాగిన రాజకీయ పరిణామాలకు సోమవారం ముగింపు లభించింది. కాగా, మాజీ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఎవరికి మద్దతు తెలపలేదని స్పష్టం చేశారు. పార్టీ నిర్ణయం ప్రకారం ఎన్నిక జరిగిందని ఆమె పేర్కొన్నారు.

# దుబ్బ రాజన్న క్షేత్రంపై 'రాజకీయ' రంగుల నీడ

- భక్తుల ఆగ్రహం

ఆలయ పవిత్రతను రాజకీయాలకు వేదిక చేస్తారా? - జిల్లా యంత్రాంగంపై విమర్శల వెల్లువ



**నేటి సాక్షి సారంగాపూర్ జగిత్యాల:** జగిత్యాల జిల్లాలో అత్యంత ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం, పెంబట్ల కోనాపూర్ గ్రామ పరిధిలోని దుబ్బ రాజేశ్వర స్వామి దేవాలయం ప్రస్తుతం వివాదాలకు కేంద్రబిందువుగా మారింది. మహాశివరాత్రి ఉత్సవాల వేళ ఆలయ గోపురంపై అధికార పార్టీ రంగులను తలపించేలా రంగులు వేయడంపై భక్తులు మరియు స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ క్షేత్రానికి మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. అయితే, ఈ పర్వదినం వేళ ఆలయ పైభాగంలో కాంగ్రెస్ పార్టీ జెండా రంగులను పోలిన రంగులు వేయడం చర్చనీయాంశమైంది. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన చర్య అని, దేవాలయాన్ని రాజకీయ వేదికగా మారుస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ రంగుల మార్పుపై దేవస్థాన అధికారులు గానీ, జిల్లా యంత్రాంగం గానీ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. విశ్వాసాలపై దాడి "ఆలయాలు దేవుడి నివాసాలు తప్ప పార్టీ కార్యాలయాలు కావు" అని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంప్రదాయ శైవ శైలిని దెబ్బతీస్తూ రాజకీయ రంగులు వేయడం తమ భక్తిని అవమానించడమేనని వారు వాపోతున్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా దేవాలయాల రంగులు మారుతాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారులు పాలకవర్గానికి కొమ్ముకాస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే ఆలయ గోపురంపై ఉన్న రాజకీయ రంగులను తొలగించి, పురాతన సంప్రదాయం ప్రకారం రంగులు వేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో భక్తుల నిరసనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# జగిత్యాల కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- "ఎమ్మెల్యే సంజయ్‌కి నియోజకవర్గం పట్టా రాసిచ్చారా?" అధిష్టానంపై సీనియర్ నేత ఆగ్రహం



**నేటి సాక్షి జగిత్యాల :** జగిత్యాల కాంగ్రెస్ పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బట్టబయలయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వైఖరిపై ఎమ్మెల్సీ, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం జగిత్యాల ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన భావోద్వేగానికి గురయ్యారు.

### జీవన్ రెడ్డి చేసిన ప్రధాన వ్యాఖ్యలు:

జగిత్యాల కాంగ్రెస్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కి 'పవర్ ఆఫ్ అటార్నీ' రాసిచ్చారా? అని ఆయన పార్టీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ పట్టా రాసివ్వడం ఏంటని నిలదీశారు. సంజయ్ ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం తనకు, తన వర్గీయులకు వేధింపులు తప్పవని జీవన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న తనకు అవమానాలు ఎదురవుతున్నాయని ఆవేదన చెందారు. "పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు.. కాంగ్రెస్ పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నా" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. స్పీకర్ దృష్టిలో సంజయ్ ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని, కానీ ఆయన కాంగ్రెస్‌తో 'సంసారం' చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయించిన వారు పాత కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు, మేయర్/చైర్మన్ పీఠం ఎంపిక విషయంలో ఇద్దరు నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేస్తుండగా, ఎమ్మెల్యే సంజయ్ తన వర్గానికి ప్రాధాన్యం కోరుతుండటంతో ఈ వివాదం సంచలనంగా మారింది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడే యోచనలో ఉన్నట్లు సంకేతాలు ఇవ్వడం జగిత్యాల జిల్లా కాంగ్రెస్‌లో కలకలం రేపుతోంది. అధిష్టానం వెంటనే జోక్యం చేసుకోకుంటే పార్టీకి భారీ నష్టం తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పీఠం దక్కించుకోలేని బిజెపి

**నేటి సాక్షి - రాయికల్ ఇమ్మడి విజయ్ం కుమార్ :** రాయికల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఐదు వార్డులు బిజెపి కైవసం చేసుకుంది. అయినా కూడా మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడంలో విఫలమైంది. మున్సిపల్ చైర్మన్ పీఠానికి ఇద్దరు కౌన్సిలర్లను మద్దతు తో బిజెపి పీటం దక్కించుకొని పరిపాలన సాగిస్తుందని అందరూ ఊహించుకున్నారు. కానీ కౌన్సిలర్ల మద్దతు లేకపోవడంతో పీఠాన్ని దక్కించుకోక పోవడం గమనార్హం. దీంతో బిజెపి కార్యకర్తలు మరియు నాయకులకు నిరాశే మిగిలింది.

# సీఎం కప్‌లోకి ఎంపికైన

## మైనారిటీ విద్యార్థులు



**నేటి సాక్షి, జగిత్యాల గుండ ప్రశాంత్ గౌడ్:** సీఎం కప్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగంలో ఏ. హర్షవర్ధన్ 100 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం ఎన్ విష్ణువర్ధన్ 400 మీటర్ల పరుగుపందెం లో బంగారు పతకం మరియు లాంగ్ జంప్ బంగారు పతకం ఎండి. సబీల్ 200 మీటర్ల పరుగుపందెంలో వెండి పథకం మరియు వాలీ బాల్ పోటీల్లో ఏ. హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినందుకు కళాశాల ప్రిన్సిపల్ ఎన్. మహేందర్ విదార్థులను మరియు ఫిజికల్ డైరెక్టర్ అంజయ్యను ప్రత్యేకంగా అభినందించారు కళాశాల ఉపన్యాసక బృందం కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ నవీన్ కుమార్ తిరుపతి జగన్ మహేష్ నిజాముద్దీన్ జ్యోతి సరిత కళ్యాణి అపర్ణ ఇమ్రాన్ విజయ్ లు ప్రత్యేకంగా అభినందించారు.

# కళ్యాణ వేడుకలో సర్పంచ్



**నేటి సాక్షి-మేడిపల్లి:** మేడిపల్లి మండల కేంద్రంలో ని శ్రీ ఓంకారేశ్వర స్వామి ( శ్రీ రాజరాజేశ్వర స్వామి) శివపార్వతుల కళ్యాణం అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న మేడిపల్లి సర్పంచ్ మకిలి దాసు, దేశవేని కృష్ణ, ఆర్మూర్ హరీష్, మోతే చారీబాబు, తోపారపు నవీన్, పరమేష్ రావు , గంగ శేఖర్, మల్లారెడ్డి, ఓలుపుల గంగరాజశీ, ఆర్మూరి వంశీ, ఉప్పు రమేష్, ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు శివమాల స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కౌన్సిలర్‌ని సన్మానం

## బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్.



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ మునిసిపల్ 9వ వార్డు కౌన్సిలర్గా ఇదనోళ్ల మమత అంజి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారికీ బీ ఆర్ ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా నాకు సహకరించిన పెద్దలకు గ్రామస్తులకు నాయకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ నాపై నమ్మకం ఉంచినా ప్రతి ఒక్కరికి మరొకసారి కృతజ్ఞతలు. కాలనీ లో ఏ సమస్యలున్నా పరిష్కరించే దిశగా ముందులో ఉంటానని డ్రైనేజీ సమస్యగానే వాటర్ సమస్యగానే వీధిలైట్ల సమస్యలు కానీ ప్రతి ఒక్కటి చేసి చూపిస్తా అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ రమణ, సుభాన్ రెడ్డి, పడిగాళ్ళ అశోక్, అనిల్ కుమార్, అంజి, రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

## చేసిన ఉపసర్పంచ్ కూన సంతోష్



**నేటిసాక్షి, గన్నేరువరం, బుర్ర అంజయ్య గౌడ్:** గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు చాకలివాని పల్లె ఉపసర్పంచ్ కూన సంతోష్ ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత మంచి మార్గంలో నడవాలని క్రీడలతో మానసిక ఉల్లాసం మరియు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జిల్లాకు మండలానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. బోయిన్పల్లి మండలం లోని నర్సింగాపూర్ గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో మొదటి బహుమతి ఎలగందుల రెండో బహుమతి గన్నేరువరం జట్టు గెలుపొందగా ప్రజా ప్రతినిధులు క్రీడాకారులకు ట్రోఫీతో పాటు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామస్తులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో సర్పంచ్ భర్త బరితెగింపు

- మాజీ ఎంపీటీసీపై భౌతిక దాడి
అభివృద్ధి పనులపై ప్రశ్నించడమే నేరమా?
- పంచాయతీ సెక్రటరీ ముందే దౌర్జన్యం





**నేటి సాక్షి కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో అధికార గర్వం తలకెక్కిన ఓ సర్పంచ్ భర్త మాజీ ప్రజాప్రతినిధిపై భౌతిక దాడికి దిగిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామాభివృద్ధి గురించి అడిగినందుకు మాజీ ఎంపీటీసీపై సర్పంచ్ భర్త చేయిచేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. మాదాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జంగ శ్రీహరి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ అపర్ణతో కలిసి గ్రామంలోని మురికికాలువల శుభ్రత, ఇతర అభివృద్ధి పనుల గురించి చర్చిస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న సర్పంచ్ జంగ భూలక్ష్మి భర్త దేవేందర్, ఒక్కసారిగా శ్రీహరిపై విరుచుకుపడ్డారు. వెనుక నుంచి వచ్చి శ్రీహరి చెంపపై కొట్టడమే కాకుండా, పిడిగుద్దులతో దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. వివాదానికి కారణాలు ప్రశ్నిస్తున్నాడనే కక్ష: గ్రామాభివృద్ధి గురించి శ్రీహరి ప్రతిరోజూ అడుగుతున్నాడనే కోపంతోనే తాను దాడి చేసినట్లు నిందితుడు దేవేందర్ అంగీకరించడం గమనార్హం. షాడో సర్పంచ్ పాలన గ్రామానికి భూలక్ష్మి సర్పంచ్‌గా ఉన్నప్పటికీ, ఆమె భర్త దేవేందర్ 'షాడో సర్పంచ్'లా వ్యవహరిస్తూ అధికారాలు చెలాయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ గొడవతో తనకు సంబంధం లేదని, ఆఫీసులో వాగ్వాదం జరుగుతుంటే బయటకు వెళ్లమని మాత్రమే చెప్పానని సెక్రటరీ అపర్ణ పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధి కోసం పాటుపడే మాజీ ప్రజాప్రతినిధిపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు శ్రీహరి ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాదాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. సర్పంచ్ భర్తల జోక్యం పంచాయతీ పాలనలో ఏ స్థాయిలో ఉందో ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. అధికారులు స్పందించి ఇలాంటి 'షాడో' అధికారాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలకు వికారాబాద్ క్రీడాకారులు సిద్ధం



- శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా.

**నేటి సాక్షి వికారాబాద్ :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రేపటి నుండి ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్న "4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్-2026" పోటీలకు చార్మినార్ జోన్ తరపున వికారాబాద్ జిల్లా నుండి ఎంపికైన క్రీడాకారులతో జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో క్రీడాకారులను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి లోనయ్యే పోలీస్ సిబ్బందికి క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి, క్రమశిక్షణతో ఆడి జిల్లాకు, ఛార్మినార్ జోన్‌కు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.. కేవలం గెలుపు ఓటములే ప్రధానం కాదని, క్రీడా స్ఫూర్తితో పాలుపంచుకోవడం ముఖ్యమని తెలిపినారు. జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతి క్రీడాకారుడికి ఆమె వ్యక్తిగతంగా అభినందనలు తెలియజేస్తూ, వారికి అవసరమైన అన్ని వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం క్రీడాకారులతో కలిసి గ్రూప్ ఫోటో షూట్‌లో పాల్గొని వారిలో నూతనోత్తేజాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ఐ లు డేవిడ్ విజయ్ కుమార్, శ్రీశైలం, నాగరాజు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# మూడుచింతలపల్లి మున్సిపాలిటీలు బిఆర్ఎస్ కైవసం

- మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి



**నేటి సాక్షి, మేడ్చల్:** మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోనీ ఎల్లంపేట్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకున్నాయి. ఎల్లంపేట్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పీఠాలను భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కైవసం చేసుకున్న సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీ ఛైర్పర్సన్ గా లౌడియా శ్రీదేవి, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్‌గా జాము రవి ఎన్నిక కాగా, వైస్ చైర్మన్‌గా కొల్తూర్ మోర్సుబాయి శశిరేఖ ఎన్నుకోబడ్డారు. అనంతరం మున్సిపల్ కార్యాలయలలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ ఛైర్మన్‌లను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా వీరిని ఎన్నుకున్నారు. వారందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ పార్టీ నమ్మకాన్ని నిలబెట్టేలా అభివృద్ధి పనులు చేపట్టాలని వారికీ సూచించారు. ఈ ఎన్నికల్లో బిఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులు గెలుపొందటానికి అహర్నిశలు కృషి చేసిన పార్టీ ఇంచార్జ్ లకు నాయకులకు, కార్యకర్తలకు ఓటు వేసిన ప్రతి ఒకరికి ధన్యవాదలు తెలియజేస్తున్నాను. పార్టీ శ్రేణులు ఈ విజయాన్ని ఘనంగా జరుపుకున్నాయి. ఈ కార్యక్రమలలో ఇంచార్జ్ గజ్జెల నగేష్, మేడ్చల్ బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, యువనాయకులు డాక్టర్ చామకూర భద్రారెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ లక్ష్మ రెడ్డి, నాయకులు భాస్కర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 23న సంత్ సేవలాల్ జయంతిని జయప్రదం చేయండి



- ఎమ్మెల్సీ శంకర్ నాయక్, స్కైలాబ్ నాయక్

**నేటిసాక్షి, మిర్యాలగూడ:** గిరిజనుల ఆరాధ్యదైవం "శ్రీశ్రీశ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఈనెల 23న మిర్యాలగూడలో ఘనంగా జరుపుకోవాలని ఎంఎల్సీ కేతవత్ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్ లు అన్నారు. పట్టణంలోని బంజారా భవన్ లో సోమవారం గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు స్కైలాబ్ నాయక్ లు మాట్లాడుతూ, సంత సేవాలాల్ మహారాజ్ సూచించిన మార్గంలో బంజారా సోదరులు నడవాలని కోరారు. తండా నుండి గిరిజన వాడల నుండి పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీలకతీతంగా జరగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాలను వినూత్న రీతిలో చేసి, సేవాలాల్ గొప్పతనాన్ని ప్రజల్లో తీసుకుపోవాలని సూచించారు. ఈ కార్యక్రమ విజయవంతనికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అధికారికంగా జరిగే కార్యక్రమానికి వివిధ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగు నాయక్, రవితేజ నాయక్, మానియా నాయక్, హాతిరాం నాయక్, సర్పంచులు శంకర్ నాయక్, రవి నాయక్, ఉద్యోగ సంఘ నాయకులు మాలోత్ దశరథ నాయక్, ధర్మానాయక్, తిరుపతి నాయక్, కృష్ణ కాంత్ నాయక్, సైదులు నాయక్, మక్లా నాయక్, భీమ్లా నాయక్, జనార్ధన్ నాయక్ బాబు నాయక్, శ్రీను నాయక్, రవీందర్ నాయక్, శ్రీహరి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాద వితరణ





**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో శివరాత్రి సందర్భంగా యోగేశ్వర స్వామి దేవాలయం(మల్లన్న గుడి)లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..కార్యక్రమంలో మన్నే మల్లేశం, జంగపల్లి ఆంజనేయులు,కల్లెపు నరేష్,బెజ్జనబోయిన రాములు,ఇప్ప స్వామి, ఈదుగల్ల బాలయ్య, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు...

## దుబ్బ రాజరాజేశ్వర స్వామి

దర్శించుకున్న దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్

చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** కాన్గల్ గ్రామంలో శ్రీ దుబ్బ రాజరాజేశ్వర స్వామి నీ దర్శించుకోవడం జరిగింది మన దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్న అదేవిధంగా ఆత్మ కమిటీ దుబ్బాక నియోజకవర్గం అధ్యక్షులు నరేందర్ రెడ్డి మండల అధ్యక్షులు అక్కం స్వామి సర్పంచ్ సత్తయ్య తొగుట సర్పంచ్ కొండల్ రెడ్డి భూపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య భూపాల్ రెడ్డి యూత్ అధ్యక్షుడు స్వామి యాదవ్ కొండల్ రెడ్డి భాస్కర్ రెడ్డి వెంకట్ రెడ్డి డైరెక్టర్ బిక్షపతి ఆత్మ కమిటీ డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి రెండవ వార్డ్ మెంబర్ పిట్ల కనకయ్య నరేష్ వేలేందర్ రెడ్డి మాసంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు ఎల్లం జితేందర్ రెడ్డి కొండల్ రెడ్డి సత్యం చారి మాదారం మల్లయ్య ఉపాధ్యక్షులు స్వామి గౌడ్ వెలందర్ రెడ్డి కుమార్ సంగుపల్లి పరశురాములు వార్డు సభ్యులు కవిత భీమయ్య చంద్రశేఖర్ గౌడ్ కోఆపరేటివ్ డైరెక్టర్ శ్రీధర్ మిగతా సీనియర్ నాయకులు భక్తులు పార్టీ నాయకులు అందరు కలిసి పాల్గొనడం జరిగింది

## రామలింగేశ్వర స్వామి కళ్యాణం



**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** తొగుట మండల కేంద్రంలో శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో శివ కళ్యాణం ఆలయపు పురోహితులు జయ రామ పంతులు దంపతులు శివ కళ్యాణం ఘనంగా నిర్వహించారు ప్రతి సంవత్సరం మహా శివరాత్రి రోజున శివ కళ్యాణం నిర్వహిస్తున్నామన్నారు జయ రామ పంతులు మాట్లాడుతూ కోరుకున్న కోరికలు నెరవేర్చే శ్రీ భవాని రామలింగేశ్వరుడని శివుడు తెలిపారు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాగాల శోభ కొండల్ రెడ్డి క్యాస చంద్రశేఖర్ పద్మ రాజ్‌కుమార్ నల్లబెల్లిఆంజనేయులురవీందర్ రెడ్డి వెంకట్ రెడ్డి ప్రతాపరెడ్డి గ్రామస్తులు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## చెస్ విజతగా చిద్విలాసి

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నిక



**నేటిసాక్షి నల్లగొండ:** జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన సీఎం కప్ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ లో కుమ్మరికుంట్ల చిద్విలాసిని విజేతగా నిలిచి, రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కి సెలెక్ట్ అయ్యారు. ఈ టోర్నమెంట్‌లో 5 పాయింట్స్‌కి 5 సాధించి విజేతగా నిలిచినట్లు తెలిపారు. చిద్విలాసిని ప్రస్తుతం సూర్యాపేట లోని ర్యాడికల్ చెస్ అకాడమీలో కోచింగ్ తీసుకుంటుంది. ఈమె విజయం పట్ల కోచ్ యడవల్లి అనిల్ కుమార్ హౌసింగ్ బోర్డు చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ రనబోతు జయంతి నర్సిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించి కప్ సాధించాలని, మిర్యాలగూడ కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకురావలని ఆకాంక్షించారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడిపై సొంత పార్టీ శ్రేణుల దాడి!

- మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ పీఠం చేజారడంతో ఆగ్రహం
- యాదగిరి బాబు ఇంటిపై దాడి... ఫర్నిచర్ ధ్వంసం
- ఆలస్యంగా విప్ జారీ చేశారనే ఆరోపణలు





**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.! మున్సిపల్ చైర్మన్ ఎన్నిక అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు నివాసంపై అదే పార్టీకి చెందిన కార్యకర్తలు, కౌన్సిలర్లు దాడికి దిగడం సంచలనం సృష్టించింది. ఆలస్యంగా విప్ జారీ చేయడంతో చైర్మన్ పీఠం చేజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పది సీట్లు గెలిచినా దక్కని చైర్మన్ పీఠం.!

ఇటీవల జరిగిన మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధికంగా 10 స్థానాలు గెలుచుకుంది. బలం ఉన్నప్పటికీ మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకోలేకపోయింది. చైర్మన్ ఎన్నికలో బీజేపీ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు పలకడంతో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకుంది. 'విప్'ను ఎన్నికల అధికారికి ఆలస్యంగా అందజేయడం వల్లే ఈ పరిణామం చోటుచేసుకుందని కౌన్సిలర్లు ఆరోపించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు నిర్లక్ష్య వైఖరే కారణమని వారు మండిపడ్డారు.

### ఇంటిపై దాడి.. కుర్చీలు విరగ్గొట్టి..

సోమవారం మున్సిపల్ ఆఫీస్ మెట్‌పల్లిలో చైర్మన్ ఎన్నిక అనంతరం సుమారు మధ్యాహ్నం 3:45 గంటల సమయంలో బొడ్ల రమేష్, బొడ్ల గౌతం, సుకేటి విజయ్, రణధీర్ మరియు వారి అనుచరులు కలిసి రాచకొండ యాదగిరి బాబు ఇంటిపై దాడికి యత్నించారు. ఇంట్లోని కుర్చీలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. యాదగిరి బాబు అక్కడికి చేరుకున్న సమయంలో ఆయనపై కూడా దాడికి ప్రయత్నించినట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

### పోలీసుల జోక్యం... కేసు నమోదు

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. యాదగిరి బాబు కుమారుడు రాచకొండ రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి సబ్‌ఇన్‌స్పెక్టర్ పి. కిరణ్ కుమార్ తెలిపారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఇలాంటి గొడవలు, దాడులు అంగీకరించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

### దాడి అన్యాయం : యాదగిరి బాబు

ఈ ఘటనపై యాదగిరి బాబు స్పందిస్తూ, పార్టీ కోసం కష్టపడుతున్న తనపై సొంత పార్టీ శ్రేణులే దాడి చేయడం బాధాకరమని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనతో జగిత్యాల జిల్లా రాజకీయాల్లో కలకలం రేగింది. పట్టణంలో మరిన్ని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు.







# 'మెట్‌పల్లి ప్రజలు మమ్మల్ని క్షమించండి'!




- గెలుపొందిన బీజేపీ కౌన్సిలర్ల ఆవేదన
- చైర్మన్ పీఠం చేజారడానికి పార్టీ పెద్దల వైఫల్యమే కారణమని విమర్శ
- 12 గంటల వరకు విప్ లేదు... సాయంత్రం 5కి జారీ చేశారు' అంటూ ఆరోపణ
- విశ్వాసం కోల్పోం... ప్రజాసేవలో వెనుకడుగు వేయమని హామీ

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ పదవి చేజారిన నేపథ్యంలో బీజేపీ కౌన్సిలర్లు దొనికెల నవీన్, బొడ్ల రమేష్ మీడియా సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఇచ్చిన తీర్పును నిలబెట్టుకోలేకపోయామని క్షమాపణ కోరుతూ, ఈ పరిణామానికి పార్టీ పెద్దల వైఫల్యమే కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు.

### '10 సీట్లు ఇచ్చిన ప్రజలకు క్షమాపణ

మెట్‌పల్లి మున్సిపాలిటీలో 26 సీట్లలో 10 స్థానాలు బీజేపీకి అప్పగించిన ప్రజలకు తలవంచి క్షమాపణ కోరుతున్నామని కౌన్సిలర్లు పేర్కొన్నారు. 'మా మీద నమ్మకం ఉంచి 10 స్థానాలు ఇచ్చారు... కానీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోలేకపోయాం. ఇది మా కార్యకర్తల కష్టానికి తగిన ఫలితం కాదు' అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్ధాంతాలతో పార్టీని నిలబెట్టి, కష్టపడి స్థానాలు గెలిపిస్తే ఇలాంటి పరిణామం రావడం బాధాకరమన్నారు.

### విప్ జారీపై తీవ్ర ఆరోపణలు.!

చైర్మన్ ఎన్నిక రోజు మధ్యాహ్నం 12 గంటల వరకు విప్ జారీ చేయకుండా, సాయంత్రం 5 గంటలకు విప్ జారీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. 'డబ్బులు తీసుకుని కావాలనే ఆలస్యం చేశారు... అమ్ముడుపోయారు' అంటూ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర నాయకులపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విప్ ఆలస్యంగా జారీ కావడంతో అర్డీవో చెల్లదని పేర్కొన్నారని తెలిపారు. సమయానికి నిర్ణయం తీసుకుని ఉంటే మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంపై బీజేపీ జెండా ఎగురవేసేవాళ్లమని అన్నారు.

### కార్యకర్తల కష్టాలు బూడిదలో పోశారు


పార్టీ కార్యకర్తలు రాత్రింబవళ్లు శ్రమించి 10 సీట్లు గెలిపించారని, కానీ నాయకత్వ వైఫల్యంతో ఆ కష్టాన్ని బూడిదలో పోశారని కౌన్సిలర్లు మండిపడ్డారు. 'సిద్ధాంతాలతో పని చేసిన మమ్మల్ని ఇలా మోసం చేయడం సరైంది కాదు' అని వ్యాఖ్యానించారు. పార్టీని కాపాడుకోవడం కోసం పోరాడుతామని, నిజాలు బయటపెడతామని చెప్పారు.

### విశ్వాసం కోల్పోం.. ప్రజాసేవ కొనసాగుతుంది

ఈ పరిణామంపై ప్రజలకు క్షమాపణ కోరుతూ, ఇకపై ఇలాంటి తప్పిదాలు జరగకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 'మెట్‌పల్లి ప్రజలు మమ్మల్ని క్షమించాలి... మీ విశ్వాసం కోల్పోం. చైర్మన్ పీఠం దక్కకపోయినా ప్రజాసేవను వదిలే ప్రసక్తే లేదు' అని స్పష్టం చేశారు. ఈ ప్రెస్‌మీట్‌తో మెట్‌పల్లి రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# విప్ ధిక్కరణపై చర్యలు తప్పవు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు హెచ్చరిక
- చెట్లపల్లి మీనా, సుఖేందర్ గౌడ్ సస్పెన్షన్‌కు రాష్ట్రాధిష్టానానికి ఫిర్యాదు
- పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు


భారతీయ జనతా పార్టీ
జగిత్యాల జిల్లా-505 327 (తెలంగాణ)
డా॥ రాచకొండ యాదగిరి బాబు
B.J.P. జగిత్యాల జిల్లా అధ్యక్షులు
Mobile: 9963888999
తేది.16/2/2026
ఇ.నెం. 2-1-145/8, దుబ్బవాడ, మెట్‌పల్లి-505 325, జి॥ జగిత్యాల, తెలంగాణ

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో పార్టీ విప్‌ను ధిక్కరించి కాంగ్రెస్‌కు మద్దతుగా ఓటు వేసిన ఘటనపై కౌన్సిలర్ చెట్లపల్లి మీనా, ఆమె భర్త చెట్లపల్లి సుఖేందర్ గౌడ్‌లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని రాష్ట్రాధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు డా. రాచకొండ యాదగిరి బాబు వెల్లడించారు.

### విప్‌ను ధిక్కరించినట్లు ఆరోపణ

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన కౌన్సిలర్ చెట్లపల్లి మీనా మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు మద్దతుగా ఓటు వేసినట్లు జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఇది పార్టీ విప్‌కు వ్యతిరేక చర్యగా భావించిన జిల్లా నాయకత్వం, ఈ విషయాన్ని రాష్ట్రాధిష్టానానికి నివేదించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో పార్టీ నాయకుడు చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ కూడా పాత్ర వహించినట్లు ఆరోపిస్తూ, ఆయనపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎవరైనా సరే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

### పార్టీ ప్రతిష్ట కాపాడుతాం

పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలు ప్రతి కార్యకర్త, ప్రజాప్రతినిధి పాటించాల్సిందేనని యాదగిరి బాబు తెలిపారు. పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసే చర్యలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు.

# విప్ ధిక్కరణపై అధిష్ఠానం సీరియస్!

- బీజేపీ కౌన్సిలర్ మీనా, భర్త సుఖేందర్ గౌడ్‌కు 6 ఏళ్ల సస్పెన్షన్
- మెట్‌పల్లి చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్‌కు మద్దతు... క్రమశిక్షణా చర్యలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల అనుమతితో రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ నిర్ణయం


BHARATIYA JANATA PARTY
Telangana
Dr. Shyam Prasad Mukherjee Bhavan, Opp: Exhibition Grounds, Nampally, Hyderabad- 500 001.
తేది: 16.02.2026

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో పార్టీ విప్‌ను ధిక్కరించి కాంగ్రెస్‌కు మద్దతుగా ఓటు వేసిన నేపథ్యంలో బీజేపీ కౌన్సిలర్ చెట్లపల్లి మీనా, ఆమె భర్త చెట్లపల్లి సుఖేందర్ గౌడ్‌లను భారతీయ జనతా పార్టీ నుండి ఆరు సంవత్సరాలపాటు సస్పెండ్ చేసినట్లు పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ ప్రకటించింది.

### నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణ

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన కౌన్సిలర్ శ్రీమతి చెట్లపల్లి మీనా మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఓటు వేసినట్లు పార్టీ పేర్కొంది. ఇది పార్టీ విప్‌ను ధిక్కరించడం మాత్రమే కాకుండా, పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం అని స్పష్టం చేసింది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించారని ఆరోపించింది.

### భర్తపై కూడా క్రమశిక్షణా చర్య

ఈ పార్టీ వ్యతిరేక చర్యకు సహకరించినట్లు ఆరోపణల నేపథ్యంలో ఆమె భర్త చెట్లపల్లి సుఖేందర్ గౌడ్‌పై కూడా చర్యలు తీసుకున్నారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడ్డారని నిర్ధారించిన నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల అనుమతితో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన ఈ ఇద్దరిని భారతీయ జనతా పార్టీ నుండి ఆరు సంవత్సరాలపాటు సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ కన్వీనర్ రవీందర్ విశ్వనాథ్ ప్రకటించారు.

### తక్షణమే అమల్లోకి సస్పెన్షన్

ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి సంబంధించిన ప్రతులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులకు, అలాగే జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబుకు పంపించినట్లు వెల్లడించారు.

# ప్రజలే బుద్ధి చెబుతారు!

- బీజేపీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌కు మద్దతు - ద్రోహం చేసిన వారిపై చర్యలు తప్పవు
- మెట్‌పల్లి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ధర్మపురి స్వరూప-వేణుగోపాల్

**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా, మెట్ పల్లి: బీజేపీ గుర్తుపై గెలిచి, చైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించడం పార్టీకి చేసిన ద్రోహమని బీజేపీ నాయకులు ధర్మపురి స్వరూప-వేణుగోపాల్ తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి ద్రోహ రాజకీయాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు.

### ద్రోహులకు గుణపాఠం తప్పదు

చెట్లపల్లి మీనా-సుఖేందర్ గౌడ్ దంపతులు పార్టీ విప్‌ను ధిక్కరించి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వడం నైతికంగా సరైంది కాదన్నారు. ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచి గెలిపించారని, ఆ విశ్వాసాన్ని వమ్ము చేయడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై రాష్ట్ర అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

### ప్రజల తీర్పుకు వందనం

మెట్‌పల్లి మున్సిపాలిటీలో 26 సీట్లలో 10 స్థానాలు బీజేపీకి కట్టబెట్టిన పట్టణ ప్రజలకు ధర్మపురి స్వరూప-వేణుగోపాల్ కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ పదవి దక్కకపోయినా ప్రజాసేవలో వెనుకడుగు వేయబోమని, పట్టణ అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తామని చెప్పారు.

### ప్రజా సేవే లక్ష్యం..

పదవులు శాశ్వతం కావని, ప్రజా సేవే శాశ్వతమని స్వరూప- వేణుగోపాల్ అన్నారు. బీజేపీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. మెట్ పల్లి పట్టణ అభివృద్ధికి బీజేపీ కౌన్సిలర్లు ఐక్యంగా పనిచేస్తారని వెల్లడించారు.









# మెట్‌పల్లి చైర్మన్ పీఠం కాంగ్రెస్ కైవసం!

## ఉత్కంఠ భరిత వాతావరణంలో హైడ్రామా

**బీజేపీ కౌన్సిలర్ క్రాస్ ఓటుతో మారిన సమీకరణాలు**

**చైర్మన్‌గా 'మైలారపు లింబాద్రి' వైస్ చైర్మన్‌గా 'ఓంకారి నవీన్' ఎన్నిక**

**మొదటి సమావేశంలోనే హేమాహేమీలకు షాక్**



**నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య):** మెట్‌పల్లి మున్సిపాలిటీలో జరిగిన చైర్మన్ ఎన్నిక రాజకీయంగా ఉత్కంఠభరితంగా సాగి చివరకు కాంగ్రెస్ పార్టీ కైవసం అయింది. మొత్తం 26 వార్డులున్న మున్సిపాలిటీలో బీజేపీ 10, బీఆర్ఎస్ 6, కాంగ్రెస్ 6, ఇండిపెండెంట్ 4 స్థానాలు గెలుచుకున్నాయి. కానీ చైర్మన్ ఎన్నికలో సమీకరణాలు ఒక్కసారిగా మారిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### చైర్మన్ ఎన్నికలో క్రాస్ ఓటు ప్రభావం.!


సోమవారం నిర్వహించిన చైర్మన్ ఎన్నికలో మొత్తం 26 మంది సభ్యులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా 17వ వార్డు కౌన్సిలర్ మైలారపు లింబాద్రి పేరు ప్రతిపాదించగా, కాంగ్రెస్ 6 మంది, ఇండిపెండెంట్ 4 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. ఆశ్చర్యకరంగా బీజేపీకి చెందిన 18వ వార్డు కౌన్సిలర్ చెట్లపల్లి మీనా కూడా చేయి ఎత్తడంతో కాంగ్రెస్ బలం 11కి చేరింది. దీంతో 11 ఓట్ల మెజారిటీతో మైలారపు లింబాద్రి చైర్మన్‌గా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. అంతకుముందు బీజేపీ తరఫున ధర్మపురి స్వరూప పేరును ప్రతిపాదించగా 9 మంది బీజేపీ కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. అయితే చెట్లపల్లి మీనా చేయి ఎత్తకపోవడంతో బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఇక బీఆర్ఎస్ తరఫున పూదరి జ్యోతి పేరును ప్రతిపాదించగా 6 మంది కౌన్సిలర్లు, ఎమ్మెల్యే సంజయ్ కలిసి మొత్తం 7 ఓట్లు వచ్చాయి.

### వైస్ చైర్మన్ కూడా కాంగ్రెస్ ఖాతాలో..

చైర్మన్ ఎన్నిక అనంతరం వైస్ చైర్మన్ పదవి కూడా కాంగ్రెస్ కైవసం అయింది. ఓంకారి నవీన్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్, వైస్ చైర్మన్ రెండు పదవులు కాంగ్రెస్ దక్కించుకోవడం విశేషంగా మారింది. అనంతరం జువ్వాడి నర్సింగరావు సహా కాంగ్రెస్ నాయకులు, వైశ్య సంఘం ప్రతినిధులు లింబాద్రిని శాలువాలతో సత్కరించారు.

### పాత కాపులు లేకుండానే మొదటి సమావేశం

మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ఈసారి అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. పాత కాపులుగా పేరొందిన పలువురు సీనియర్లు ఈసారి ఓటర్ల తీర్పుతో బయటపడ్డారు. కాంగ్రెస్‌కు చెందిన యామ రాజయ్య, ఎర్రోళ్ల హన్మాండ్లు, జెట్టి లింగం లతో పాటు బీజేపీకి చెందిన షాకీర్ తదితరులు పరాజయం పాలయ్యారు. మొత్తం 26 మందిలో 23 మంది నూతన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయడం ప్రత్యేకత. చెట్లపల్లి మీనా, అంగడి పురుషోత్తం తాజా మాజీ కౌన్సిలర్లు కాగా, మైలారపు లింబాద్రి పదేళ్ల క్రితం కౌన్సిలర్‌గా గెలిచి కొంతకాలం వైస్ చైర్మన్‌గా పనిచేశారు. మహిళా రిజర్వేషన్ కారణంగా కొన్ని స్థానాల్లో కుటుంబ సభ్యులను నిలబెట్టి గెలిపించుకోవడం కూడా విశేషంగా నిలిచింది. మెట్ పల్లి ప్రజలు ఈసారి కొత్త నాయకత్వానికి మొగ్గు చూపారు. అయితే చైర్మన్ ఎన్నికలో జరిగిన క్రాస్ ఓటింగ్ రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బీజేపీ అంతర్గత అసంతృప్తి బయటపడిందా.? లేక వ్యూహాత్మక ఓటింగ్ జరిగిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొత్తానికి మెట్ పల్లి మున్సిపల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది.









# అనుచరునికే దక్కిన అధ్యక్ష పీఠం!

## కోరుట్లలో కొలువైన కొత్త మున్సి 'పాలకవర్గం'

### చైర్‌పర్సన్‌గా తిరుమల వసంత, వైస్ చైర్మన్‌గా మహ్మద్ షాహిద్ ఉల్ హద్ ఎన్నిక

- 18 మంది కాంగ్రెస్ సభ్యుల మద్దతుతో ఏకగ్రీవ విజయం
- 'సీల్డ్ కవర్'లో చైర్‌పర్సన్'-వైస్ చైర్మన్' పేరు అంటూ బయట ఉత్కంఠ చర్చలు
- లోపల అట్టహాసంగా ప్రమాణ స్వీకారం





**కోరుట్ల మున్సిపల్ కొత్త పాలకవర్గం సోమవారం అట్టహాసంగా కొలువుదీరింది. మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 13వ వార్డు నుంచి ఎన్నికైన తిరుమల వసంత (కాంగ్రెస్), వైస్ చైర్మన్‌గా 30వ వార్డు నుంచి గెలుపొందిన మహ్మద్ షాహిద్ ఉల్ హద్ (కాంగ్రెస్) ఎన్నికయ్యారు.**

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

#### ఆర్డీవో సమక్షంలో ప్రత్యేక సమావేశం

కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ సమావేశంలో మొత్తం 33 వార్డులకు చెందిన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపల్ కౌన్సిల్‌లో కాంగ్రెస్ పార్టీకి 18 మంది, బీఆర్ఎస్‌కు 8 మంది, బీజేపీకి 6 మంది, ఒక స్వతంత్ర సభ్యులు ఉన్నారు. సమావేశ మందిరం జనంతో కిక్కిరిసిపోయి, నూతన పాలకవర్గానికి అభినందనలు వెల్లువెత్తాయి.

#### ఉత్కంఠ భరితంగా-చైర్‌పర్సన్ ఎన్నిక విధానం.!

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి తిరుమల వసంత పేరును 17వ వార్డుకు చెందిన సోగ్రాబీ ప్రతిపాదించగా, 14వ వార్డుకు చెందిన రెంజర్ల కల్యాణి బలపరచారు. దీనికి కాంగ్రెస్‌కు చెందిన 18 మంది సభ్యులతో పాటు ఒక స్వతంత్ర సభ్యుడు చేతులెత్తి మద్దతు ప్రకటించడంతో తిరుమల వసంత ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికపై మున్సిపల్ కార్యాలయం బయట జనాలు ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎవరు.. ఎవరు అంటూ.. పలుమార్లు మీడియా మిత్రులను అడిగి తెలుసుకున్నారు.



#### వైస్ చైర్మన్‌గా షాహిద్ ఉల్ హద్.!

వైస్ చైర్మన్ పదవికి మహ్మద్ షాహిద్ ఉల్ హద్ పేరును 18వ వార్డుకు చెందిన అబ్దుల్ రహీం ప్రతిపాదించగా, 12వ వార్డుకు చెందిన గడ్డమీది పవన్ బలపరిచారు. కాంగ్రెస్‌కు చెందిన 18 మంది సభ్యులతో పాటు స్వతంత్ర సభ్యుడు ఏకగ్రీవంగా మద్దతు తెలపడంతో షాహిద్ ఉల్ హద్ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

#### పట్టణంలో ఉత్సాహ వాతావరణం

కోరుట్ల మున్సిపల్‌లో కాంగ్రెస్ 18 స్థానాల్లో విజయం సాధించి స్పష్టమైన మెజారిటీని అందుకుంది. నూతన పాలకవర్గం ఎన్నికతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. సమావేశం అనంతరం నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి, పూలమాలలతో అభినందనలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని నూతన చైర్పర్సన్ తిరుమల వసంత, వైస్ చైర్మన్ మహ్మద్ షాహిద్ ఉల్ హద్ పేర్కొన్నారు.









# ‘ఎల్ఈడీ’లో కనిపించింది తీసుకోండి!






# వాట్సాప్‌లో పంపింది రాసుకోండి!!

- మీడియాను అవమానించిన మున్సిపల్ కమిషనర్ రవీందర్
- కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన ప్రెస్-మీడియా మిత్రులు
- ఎవరో సూచించినట్టు కేవలం 10 మందికే అనుమతి...
- అందులోనూ తొలగించబడిన వారికి ప్రవేశమా?
- నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోని అధికారులు

కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ‘మున్సిపల్ కొత్త పాలక వర్గం ఎన్నిక’ కార్యక్రమం సందర్భంగా మీడియా ప్రతినిధులకు అవమానం జరిగింది. మున్సిపల్ కమిషనర్ రవీందర్ వ్యవహార శైలి పట్ల స్థానిక ప్రెస్-మీడియా మిత్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేసినా మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా ‘మీడియా కవరేజీ కోసమే.. ఎల్ఈడీ సిస్టమ్‌ను ఏర్పాటు చేశామని’.. కనిపించింది తీసుకోండి.. వినిపించిందో.. వాట్సాప్ గ్రూపులో పంపిందో రాసుకోండని స్వయంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ నిర్లక్ష్యంగా మాట్లాడి వెళ్లిపోవడం వివాదాస్పదమైంది.

**- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

## కొందరికే ఎంట్రీ.. లోనికి ప్రవేశం విషయంలో ఉద్రిక్తత!

మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమాన్ని కవరేజ్ చేయడానికి వచ్చిన పలువురు మీడియా ప్రతినిధులకు లోపలికి అనుమతి నిరాకరించారు. ఓ పదిమందికి మాత్రమే అనుమతి ఉందని.. అదనంగా మీడియా పాస్‌లు ఇవ్వడం కుదరదని స్పష్టం చేయడంతో వివాదానికి తెరలేచింది. దీంతో ఇదేం పద్ధతని మీడియా మిత్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తే ఎలాంటి పేర్లూ.. పేపరు.. ఛానెల్ పేర్లు రాయకుండా ఉత్తుత్తి పాస్‌లను ఇవ్వడంతో పోలీసులు అభ్యంతరం తెలిపి లోనికి పోనివ్వలేదు. కేవలం 10 మందికే అనుమతి ఇచ్చినట్టు, అందులోనూ గతంలో తొలగించబడ్డ కొందరికి ఎలా ప్రవేశం కల్పిస్తారని పలువురు ఆరోపించారు. ఈ వ్యవహారంపై అక్కడికక్కడే ఉద్రిక్తత నెలకొంది.



## మున్సిపల్ కమిషనర్‌తో ప్రెస్ వాళ్లవాగ్వాదం!

ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రవీందర్‌ను ప్రశ్నించగా మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరించడం సరికాదని జర్నలిస్టులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల వైఖరి ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. దీనికాయన మాకేం తెలీదు.. జిల్లా కలెక్టర్ ఆదేశాలు..డిపిఆర్వో సూచనల మేరకు మేం కొందరికే అవకాశం కల్పించాం.. మిగిలిన వారికి ఇదిగో..ఈ ఎల్ఈడీ సిస్టమ్ ద్వారా చూసి కవరేజ్ చేసుకోండి..అసలే ‘గరీబ్ మున్సిపాలిటీ’..లోపల స్థలం లేదు..కుర్చీలు లేవు..” అర్థం చేసుకోండి.. లేకపోతే మీ ఇష్టం..! అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి వెళ్లిపోయారు.


## ప్రెస్ వర్గాల్లో చర్చ!

ఈ ఘటనపై కోరుట్ల ప్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో మీడియాను పరిమితం చేయడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. తమకు ఇచ్చిన ‘ఉత్తుత్తి పాస్’లను అక్కడే ‘సూచిక’ బోర్డుకు తగిలించి నిరసన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని మీడియా మిత్రులు డిమాండ్ చేస్తున్నారు.!

## కవరేజీ కోసం ‘ఎల్ఈడీ’ ఏర్పాటు అంటూ వివరణ

అయితే సమావేశ మందిరం చిన్నదిగా ఉండటంతో అందరికీ సీట్లు కల్పించడం సాధ్యం కాలేదని, అందుకే బయట ప్రత్యేకంగా ‘ఎల్ఈడీ’ ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చూపించేలా చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ మీడియా ప్రతినిధులు మాత్రం తమకు ప్రత్యక్షంగా కార్యక్రమాన్ని కవరేజ్ చేసే హక్కు ఉందని పట్టుబట్టారు.












# కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్‌కు శుభాకాంక్షల వెల్లువ

- జువ్వాడి నర్సింగా రావు, కాంగ్రెస్ నాయకుల అభినందనలు
- డీజే సౌండ్స్ మధ్య అంబరాన్నంటిన గెలుపు సంబరాలు







**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన షాహెద్‌కు పట్టణంలో శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. కోరుట్ల కాంగ్రెస్ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగారావు ఆయనను అభినందిస్తూ, ప్రజల విశ్వాసంతో ఎన్నికైన షాహెద్ పట్టణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### పట్టణాభివృద్ధికి కృషి చేయాలి: జువ్వాడి

ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగా రావు మాట్లాడుతూ, మున్సిపల్ పాలనలో పారదర్శకత, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ముందుండాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### ఇతర నాయకుల అభినందనలు

మెట్‌పల్లి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, సుప్రీం కోర్టు అడ్వకేట్ హాఫిజ్ కూడా షాహెద్‌ను అభినందించారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తూ పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సంక్షేమ పథకాల సమర్థ అమలు, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### అంబరాన్నంటిన గెలుపు సంబరాలు

వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అనంతరం షాహెద్ గెలుపు సంబరాలు పట్టణంలో అంబరాన్నంటాయి. డీజే సౌండ్స్, డ్యాన్స్‌ల మధ్య పార్టీ శ్రేణులు ఆయనను ఊరేగింపుగా ఇంటివరకు తరలివెళ్లారు. వివిధ వర్గాల ప్రజలు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందం పంచుకున్నారు.











## కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంతకు అభినందనలు

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ శుభాకాంక్షలు

పట్టణ అభివృద్ధికి సహకారం అందిస్తామని హామీ



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్‌గా కొత్తగా ఎన్నికైన తిరుమల వసంత-గంగాధర్‌ను అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయిశ్వరీ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. కోరుట్ల పట్టణ ప్రజల ఆశీస్సులతో బాధ్యతలు స్వీకరించిన తిరుమల వసంత నాయకత్వంలో కోరుట్ల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సాయిశ్వరీ ఆకాంక్షించారు. మహిళా నాయకత్వం పట్టణానికి మేలు చేస్తుందని, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### అంగన్‌వాడీ సమస్యలపై చర్చ

ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సంబంధించిన సమస్యలు, వసతుల మెరుగుదలపై చర్చించారు. పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో మున్సిపాలిటీ సహకారం అందించాలని సాయిశ్వరీ కోరారు.

### సహకారం అందిస్తామన్న చైర్‌పర్సన్

అంగన్‌వాడీ సిబ్బంది సేవలు సమాజానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్న తిరుమల వసంత, వారి సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సమన్వయంతో పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు.